పంచాయతీ కార్యదర్శి సస్పెండ్

కర్నూలు కలెక్టరేట్, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): పెద్దకడుబూరు మండలం తారాపురం గ్రామ పంచాయతీ కార్యదర్శి లక్ష్మీనారాయణను కలెక్టర్ సిరి సోమవారం సస్పెండ్ చేశారు. స్వర్ణ పంచాయతీ పోర్టల్‌లో తప్పుడు ఆధార్ నెంబర్లు ఎక్కువ సంఖ్యలో అప్‌డేషన్ చేసినందుకు గాను పంచాయతీరాజ్ కమిషనర్ ఆదేశాల మేరకు సస్పెండ్ చేశారు.

ఫ్లాగ్ డే నిధికి విరాళాలివ్వండి

కర్నూలు కలెక్టరేట్, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): దేశ రక్షణ కోసం ఎన్నో త్యాగాలు చేసిన సాయుధ దళాల కుటుంబాల సంక్షేమ కోసం ఫ్లాగ్ డే నిధికి విరివిగా విరాళాలు అందజేయాలని కలెక్టర్ డాక్టర్ సిరి అధికారులను సూచించారు. ఈ మేరకు కలెక్టర్ సైనిక్ వెల్ఫేర్ ఫండ్‌కు తన వంతుగా రూ.10 వేలు విరాళం ప్రకటించారు. ప్రతి ఉద్యోగి, అధికారులు కూడా తమ వంతుగా ఆర్థికంగా సహకారం అందించాలన్నారు.

రైతుకు ధీమా ఇచ్చే బీమా

15లోపు ప్రీమియం చెల్లింపునకు అవకాశం



కర్నూలు అగ్రికల్చర్, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): రబీలో ప్రకృతి వైపరీత్యాలతో పంట నష్టపోయిన రైతులు నష్టాల నుంచి గట్టెక్కడానికి ప్రభుత్వం పంటల బీమా పథకాన్ని అమలు చేస్తుందని వ్యవసాయ శాఖ అధికార వర్గాలు తెలిపాయి. గత ఖరీఫ్‌లో కర్నూలు జిల్లాలో 4.20 లక్షల హెక్టార్లలో సాధారణ విస్తీర్ణానికి గాను దాదాపు 3లక్షల హెక్టార్లకు పైగా మాత్రమే రైతులు పంటలు సాగు చేశారు. ఆ సీజన్‌లో కూడా కూటమి ప్రభుత్వం పంటల బీమాను ప్రతి రైతు సద్వినియోగం చేసుకోవాలని నిర్ణయించిన ప్రీమియాన్ని చెల్లిస్తే ప్రకృతి వైపరీత్యాలు సంభవించినా, నష్టపరిహారాన్ని ఇన్సూరెన్స్ కంపెనీ నుంచి పొందే అవకాశం ఉంటుందని రైతులకు వ్యవసాయ శాఖ రైతన్న మీకోసం కార్యక్రమం ద్వారా అవగాహన కల్పించాలని ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ప్రస్తుతం ప్రకృతి వైపరీత్యాల వల్ల రైతులు నష్టపోకుండా ఉండాలంటే వివిధ పంటలకు ప్రభుత్వం నిర్ణయించిన ప్రీమియాన్ని రైతులు చెల్లించాలని వ్యవసాయ శాఖ జేడీ వరలక్ష్మి తెలిపారు. 7వ తేదీ వరకు ధీమా వారోత్సవాల పేరుతో రైతుల్లో పంటల్లో బీమా పై రైతులకు అవగాహన కల్పించాలని ఆదేశించారు.

నిర్లక్ష్యపు నీడలో ఉర్దూ వర్సిటీ!

రాష్ట్రంలో తొలి ఉర్దూ విశ్వవిద్యాలయం

- గత టీడీపీ ప్రభుత్వంలో కర్నూలు జిల్లా ఓర్వకల్లు వద్ద 145 ఎకరాల కేటాయింపు
- 18.30 కోట్లతో శాశ్వత భవనాల నిర్మాణానికి శ్రీకారం
- వైసీపీ హయాంలో తీవ్ర నిర్లక్ష్యం.. ఆగిన పనులు
- ఏళ్లుగా అద్దె భవనాల్లోనే విద్యార్థులకు తరగతులు
- కూటమి ప్రభుత్వం వచ్చాక చిగురిస్తున్న ఆశలు

కర్నూలు జిల్లాలోని ఉర్దూ విశ్వవిద్యాలయం నిర్లక్ష్యపు నీడలో కొట్టుమిట్టాడుతోంది. గత టీడీపీ ప్రభుత్వ హయాంలో భూమి కేటాయింపుతో పాటు రూ.18 కోట్లతో నిర్మాణాలు ప్రారంభం కాగా.. ఆ తర్వాత అధికారంలోకి వచ్చిన వైసీపీ యూనివర్సిటీ అభివృద్ధిపై శీతకన్ను వేసింది. ఒక్క ఇటుక కూడా పేర్చకపోవడంతో నిర్మాణాలు ముందుకు సాగని పరిస్థితి. ఫలితంగా గత కొన్నేళ్లుగా విద్యార్థులకు అద్దె భవనాల్లోనే తరగతులు బోధించాల్సిన దుస్థితి. ఈ నేపథ్యంలో కూటమి అధికారంలోకి రావడంతో వర్సిటీ ప్రగతిపై మళ్లీ ఆశలు చిగురించాయి.

(కర్నూలు-ఆంధ్రజ్యోతి)



కర్నూలు జిల్లా ఓర్వకల్లు వద్ద అసంపూర్తిగా ఉర్దూ యూనివర్సిటీ భవనాలు

రాష్ట్ర విభజన తరువాత అప్పటి టీడీపీ ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా డాక్టర్ అబ్దుల్ హక్ ఉర్దూ విశ్వవిద్యాలయాన్ని ఏర్పాటు చేసింది. రాష్ట్రంలో మొదటి ఉర్దూ వర్సిటీ ఇది. యూనివర్సిటీ క్యాంపస్‌కు కర్నూలు జిల్లాలోని ఓర్వకల్లు వద్ద విమానాశ్రయం పక్కనే 145 ఎకరాలు కేటాయించారు. చరిత్రలో నిలిచేలా అద్భుతమైన శాశ్వత భవనాల నిర్మాణాలకు శ్రీకారం చుట్టారు. మొదటి విడతగా రూ.18.30 కోట్లతో పనులు చేపట్టారు. అయితే ఆ తర్వాత 2019లో అధికారంలోకి వచ్చిన వైసీపీ.. ఐదేళ్లూ వర్సిటీ నిర్మాణాన్ని గాలికి వదిలేసింది. ఒక్క ఇటుక కూడా పెట్ట లేదు. దీంతో అసంపూర్తిగా నిలిచిన భవనాలు శిథిలావస్థకు చేరుకుంటున్నాయి. వాటి మధ్య ముళ్ల కంపలు, పిచ్చి మొక్కలు పెరుగుతున్నాయి. మళ్లీ సీఎం చంద్రబాబు సారథ్యంలో కూటమి ప్రభుత్వం రావడంతో వర్సిటీ నిర్మాణంపై ఆశలు చిగురించాయి. అయితే ఏడాదిన్నర కాలం గడిచినా ఉర్దూ వర్సిటీ ప్రగతిపై దృష్టి పెట్టకపోవడం విమర్శలకు తావిస్తోంది.

అద్దె కట్టి.. ప్రైవేటు భవనంలో తరగతులు

2016లో నాటి చంద్రబాబు ప్రభుత్వం ఏపీ స్టేట్ లెజిస్లేచర్ యాక్ట్-2016 ప్రకారం ఉర్దూ వర్సిటీని ఏర్పాటు చేసింది. 2017-18 విద్యా సంవత్సరం నుంచి స్థానిక ఉస్మానియా కళాశాలలో తాత్కాలిక గదుల్లో తరగతులు ప్రారంభించారు. అక్కడి నుంచి రూ.లక్షల్లో అద్దెతో నగర శివారులో ఓ ప్రైవేటు భవనంలోకి మార్చారు. ఉర్దూ, ఇంగ్లిష్, ఎకనమిక్స్, కంప్యూటర్స్, ఎంఎస్సీ కంప్యూటర్ సైన్స్, ఎంబీఏ వంటి పీజీ, యూజీ కోర్సులను ప్రారంభించారు. కర్నూలు, నంద్యాల, చిత్తూరు, కడప, విశాఖపట్నం, ఉభయ గోదావరి జిల్లాలకు చెందిన దాదాపు 220 మందికి పైగా విద్యార్థులు వివిధ కోర్సుల్లో పీజీ, డిగ్రీ చదువుతున్నారు. అకడమిక్ బ్లాక్ సహా హాస్టళ్లు, పరిపాలన భవనాలు, ల్యాబ్‌లు.. వంటి సౌకర్యాల కోసం సుమారు 52-60 వేల చదరపు అడుగుల విస్తీర్ణం కలిగిన భవనాలు అవసరం ఉంది.

పెరిగిన నిర్మాణ వ్యయం

గత టీడీపీ ప్రభుత్వ హయాంలో మొదటి విడతగా అకడమిక్ బ్లాక్, హాస్టల్ భవనాలు, రహదారులు వంటి నిర్మాణాలు ప్రారంభించారు. వివిధ దశల్లో పనులు జరుగుతుండగా ప్రభుత్వం మారింది. తర్వాత వచ్చిన జగన్ ప్రభుత్వం వర్సిటీ నిర్మాణాన్ని నిర్లక్ష్యంగా వదిలేయడమే కాకుండా.. కాంట్రాక్టర్‌కు బిల్లులు కూడా ఆపేశారు. దీంతో ఎక్కడి పనులు అక్కడే ఆగిపోయాయి. జీ ప్లస్ 3 తరహాలో అకడమిక్, అడ్మినిస్ట్రేషన్ బ్లాక్ నిర్మాణం చేసేలా డిజైన్ చేశారు. జీ ప్లస్ 1లోనే స్లాబులు, పిల్లర్ల దశలోనే పనులు నిలిచిపోయాయి. గత ఆరున్నరేళ్లుగా నిర్మాణాలు నిలిచిపోవడంతో.. నిర్మాణం వ్యయం కూడా భారీగా పెరుగుతోంది.

- మిగతా 6లో...

పతనమైన పత్తి ధరలు

క్వింటా రూ.7,429



విక్రయానికి వచ్చిన పత్తి దిగుబడులు

ఆదోని అగ్రికల్చర్, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): ఆదోని వ్యవసాయ మార్కెట్ యార్డులో పత్తి ధరలు సోమవారం స్వల్పంగా పతనమయ్యాయి. పత్తి ధర గరిష్ఠంగా క్వింటా రూ.7,429 పలికింది. మళ్లీ ధరలు పతనం కావడంతో రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వం ప్రకటించిన కనీస ధర కంటే మార్కెట్లో పలుకుతున్న ధర క్వింటాకు రూ.1,200 కంటే తక్కువ పలుకుతోంది. ఇదిలా ఉండగా సీసీఐకి అమ్ముకోవడానికి స్లాట్ బుకింగ్ కాకపోవడంతో రైతులు అవస్థలు పడుతున్నారు. స్లాట్ బుకింగ్ సమస్యను పరిష్కరిస్తే సీసీఐకి విక్రయించుకుంటామని రైతులు అంటున్నారు. కాగా సోమవారం మార్కెట్‌కు 6,553 క్వింటాళ్ల పత్తి విక్రయానికి రాగా, కనిష్ఠ ధర రూ.4,099, మధ్యస్థంగా రూ.7,201, గరిష్ఠంగా రూ.7,429 పలికింది.

బకాయిల వసూలుపై దృష్టి

వాణిజ్య పన్నుల శాఖ జాయింట్ కమిషనర్ జె.నీరజ



కర్నూలు న్యూసిటీ, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి జిల్లాలోని వ్యాపారుల నుంచి రావాల్సిన పాత బకాయిల వసూలుపై ప్రత్యేక దృష్టి పెట్టినట్లు వాణిజ్య పన్నుల శాఖ జాయింట్ కమిషనర్ జే. నీరజ అన్నారు. సోమవారం గుత్తి పెట్రోలు బంకు సమీపంలోని వాణిజ్య పనుల్న శాఖ కార్యాలయంలో ఆమె మాట్లాడుతూ జీఎస్టీలో స్లాబ్ ధరలు తగ్గడంతో ప్రజలకు మేలు జరిగిందన్నారు. దీంతో కొనుగోలు శక్తి పెరిగి అమ్మకాలు కూడ బాగా పెరిగాయన్నారు. ఈ క్రమంలో శాఖకు రెవెన్యూ వస్తుందని ఆమె వివరించారు. గతంలో సిమెంట్‌పై 28 శాతం పన్ను ఉండేదని, ప్రస్తుత సవరణలో భాగంగా 18 శాతానికి రావడంతో శాఖకు సిమెంట్ కంపెనీల నుంచి రావాల్సిన పన్ను గత సంవత్సరం నవంబర్‌తో పోల్చుకుంటే ఈ సంవత్సరం నవంబరులో సుమారు రూ.10 కోట్లు తగ్గిందన్నారు. మరో రెండు నెలల్లో ప్రభుత్వానికి పన్ను శాతం పెరుగుతుందన్నారు. వాహనాల తనిఖీ కోసం ప్రత్యేకంగా 5 బృందాలను ఏర్పాటు చేశామన్నారు.

10న నిరసన ప్రదర్శనలు

సీపీఐ జిల్లా కార్యదర్శి బి. గిడ్డయ్య



మాట్లాడుతున్న సీపీఐ జిల్లా కార్యదర్శి గిడ్డయ్య

కర్నూలు న్యూసిటీ, డిసెంబరు 1(ఆంధ్రజ్యోతి): రైతులు పండించిన పంటలకు గిట్టుబాటు ధర కల్పించాలని కోరుతూ ఈ నెల 10న అన్ని నియోజకవర్గం, మండల కేంద్రాల్లో నిర్వహించే నిరసనలు జయప్రదం చేయాలని సీపీఐ జిల్లా కార్యదర్శి బి. గిడ్డయ్య పిలుపునిచ్చారు. సోమవారం సీఆర్ భవన్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా రైతుల సమస్యలను పరిష్కరించాలని, రైతులు పండించిన పంటలకు గిట్టుబాటు ధరలు కల్పించాలని, అధిక వర్షాలు, తుపానుల కారణంగా నష్టపోయిన రైతులను ఆదుకోవాలని ఆయన డిమాండ్ చేశారు. పత్తి పంటను క్వింటా రూ.12 వేలకు ప్రభుత్వమే కొనుగోలు చేయాలన్నారు. ఈ సమావేశంలో జిల్లా సహాయ కార్యదర్శి ఎస్. మునెప్ప, జిల్లా కార్యవర్గసభ్యులు కే.జగన్నాథం, పి.రామక్రిష్ణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఏసీబీ వలలో వీఆర్వో



ఏసీబీకి పట్టుబడ్డ వీఆర్వో అశోక్‌కుమార్

పత్తికొండ, డిసెంబరు 1(ఆంధ్రజ్యోతి): తండ్రి పేరుతో ఉన్న పొలం కొడుకు పేరిట మ్యూటేషన్ చేసేందుకు రూ.40 వేలు లంచం తీసుకుంటూ ఓ వీఆర్ఓ సోమవారం ఏసీబీ వలకు చిక్కాడు. దేవనకొండ మండలం నల్లచెలిమల గ్రామానికి చెందిన కురువ మల్లన్న చనిపోవడంతో ఆయన పేరిట ఉన్న నాలుగు ఎకరాల పొలాన్ని తన తమ్ముడు కురువ కిష్టన్న పేరిట మ్యూటేషన్ చేయాలని అదే గ్రామానికి చెందిన మాజీ ఆర్మీ ఉద్యోగి శివన్న గ్రామ వీఆర్ఓ అశోక్‌కుమార్‌ను కోరాడు. దీనికి రూ.40 వేలు లంచం ఇవ్వాలని శివన్నను వీఆర్ఓ అశోక్‌కుమార్ డిమాండ్ చేశారు. కురువ శివన్న ఏసీబీ అధికారులను ఆశ్రయించాడు. ఏసీబీ అధికారులు ముందస్తు పన్నిన పథకం ప్రకారం సోమవారం పత్తికొండ పట్టణం నాలుగు స్తంభాల కూడలి వద్ద ఓ నెట్‌సెంటర్‌లో కురువ కిష్టన్న వీఆర్ఓ అశోక్‌కుమార్‌కు రూ.40 వేలు లంచం ఇచ్చారు. ఆ డబ్బును లెక్కపెట్టమని అక్కడే ఉన్న మధ్యవర్తి కుమ్మరి జయరాముడుకు వీఆర్ఓ అందించాడు. మధ్యవర్తి జయరాముడు లెక్కపెడుతుండగా ఏసీబీ అధికారులు దాడిచేసి వీఆర్ఓ అశోక్‌కుమార్‌ను, మధ్యవర్తి జయరాముడును అదుపులోకి తీసుకున్నారు. వీరిపై కేసు నమోదుచేసి చర్యలు తీసుకుంటామని డీఎస్పీ తెలిపారు. ఈ దాడుల్లో ఇన్‌స్పెక్టర్లు క్రిష్ణయ్య, రాజప్రభ, ఎస్ఐ సుబ్బరాయుడు, సిబ్బంది పాల్గొన్నారు.

గడువు ముగిసిన చిక్కీలు

- మూలన పెట్టిన ఉపాధ్యాయులు
- వారం రోజులుగా విద్యార్థులకు చిక్కీ ఇవ్వడం లేదు



అట్టపెట్టెలో మూలన పెట్టిన చిక్కీలు

మద్దికెర, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం ప్రభుత్వ పాఠశాలలో చదువుకునే విద్యార్థులకు అందించే పౌష్టికాహారంలో భాగంగా చిక్కీ కూడా సరఫరా చేస్తుంది. అయితే సదురు కాంట్రాక్టర్ గడువు ముగిసిన చిక్కీలు సరఫరా చేయడంతో ఉపాధ్యాయులు కనుగొని మూలన పెట్టడంతో వారం రోజులుగా విద్యార్థులకు చిక్కీ అందడం లేదు. వివరాల్లోకి వెళితే... మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ బాలుర పాఠశాలలో 6వ తరగతి నుంచి 10వ తరగతి వరకు మొత్తం 280 మంది విద్యార్థులు చదువుకుంటున్నారు. వారానికి మూడుసార్లు విద్యార్థులకు చిక్కీ అందజేస్తారు. అందులో భాగంగా సదురు కాంట్రాక్టరు వారానికి అవసరమయ్యే చిక్కీలను దాదాపు వేయికి పైగా పాఠశాలకు పంపించారు. అయితే.. ఉపాధ్యాయులు చిక్కీల సమయం అయిపోయిందని గుర్తించి గత నవంబరు నెల 25వ తేదీ నుంచి విద్యార్థులకు చిక్కీలు ఇవ్వడం లేదు. కాంట్రాక్టర్ నిర్లక్ష్యం వల్ల విద్యార్థులకు చిక్కీలు అందకుండా పోయాయి. రాష్ట్ర ప్రభుత్వం ఎంతో ప్రతిష్ఠాత్మకంగా పౌష్టికాహారం అందిస్తుంటే.. కాంట్రాక్టరు నిర్లక్ష్యం వల్ల విద్యార్థులకు సక్రమంగా అందడం లేదు. అలాగే ప్రభుత్వం సరఫరా చేసే కోడిగుడ్లు కూడా చిన్నసైజులో వస్తున్నాయని ఆరోపించారు. జిల్లా అధికారులు చిక్కీలు సరఫరా చేయాలని కోరుతున్నారు. ఈ విషయంపై ప్రధానోపాధ్యాయులు మోహన్ మాట్లాడుతూ గత నెల 25కే చిక్కీల గడువు ముగిసిందని గుర్తించి పిల్లలకు ఇవ్వలేదన్నారు. కాంట్రాక్టరు దృష్టికి కూడా తీసుకెళ్లామని, చిక్కీలు సరఫరా అయిన వెంటనే విద్యార్థులకు అందిస్తామన్నారు.

రోడ్డు ప్రమాదాలపై అవగాహన పెంచుతాం

ఎస్పీ విక్రాంత్ పాటిల్



మాట్లాడుతున్న ఎస్పీ

ఆలూరు, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): రోడ్డు ప్రమాదాలు జరగకుండా ప్రజల్లో మరింతగా అవగాహన పెంచుతామని ఎస్పీ విక్రాంత్‌పాటిల్ తెలిపారు. సోమవారం సాయంత్రం ఆలూరు పోలీస్‌స్టేషన్‌ను ఎస్పీ ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా రికార్డులు తనిఖీ చేశారు. పోలీస్‌స్టేషన్ ఆవరణలో మొక్కలు నాటారు. అనంతరం ఎస్పీ విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ జిల్లాలో జరుగుతున్న రోడ్డు ప్రమాదాలకు అధిక వేగం, మద్యం తాగడం ప్రధాన కారణమన్నారు. ఆయన వెంట ఆలూరు సీఐ రవిశంకర్‌రెడ్డి, ఎస్ఐలు మన్మథవిజయ్, మారుతి, సిబ్బంది ఉన్నారు.

న్యాయం చేస్తాం : ఎస్పీ విక్రాంత్ పాటిల్



ఫిర్యాదులు స్వీకరిస్తున్న ఎస్పీ

కర్నూలు క్రైం, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమానికి ప్రజల నుంచి వచ్చిన అన్ని సమస్యలను విచారించి త్వరితగతిన పరిష్కరిస్తామని ఎస్పీ విక్రాంత్ పాటిల్ తెలిపారు. సోమవారం స్థానిక కొత్తపేటలోని టూటౌన్ పోలీస్‌స్టేషన్ సమీపంలో ఎస్పీ క్యాంపు కార్యాలయంలో ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమాన్ని నిర్వహించి ప్రజల నుంచి వచ్చే ఫిర్యాదులను స్వీకరించారు. ఈ కార్యక్రమానికి మొత్తం 102 ఫిర్యాదులు వచ్చాయి. వీటిలో ప్రధానంగా... ఆలూరు దగ్గర ఉన్న అరికెర జిల్లా పరిషత్ హైస్కూల్‌లో డిజిటల్ అసిస్టెంట్ ఉద్యోగం ఇప్పిస్తామని చెప్పి రూ.1.95 లక్షలు, ఆదోని దగ్గర ఉన్న అరికల్లు డా.బీఆర్ అంబేద్కర్ గురుకుల పాఠశాలలోని హిందూస్తాన్ స్కౌట్స్ అండ్ గైడ్స్ అసోసియేషన్‌లో ఉద్యోగం ఇప్పిస్తామని రూ.80వేలు తీసుకుని దయాకర్, మరో ఇద్దరు మోసం చేశారని ఆలూరుకు చెందిన అంజలి ఫిర్యాదు చేశారు. తన 2.80 ఎకరాల పొలాన్ని ఆన్‌లైన్ చేయించుకొని తమ్ముడు చిన్న తిరుపాలు మోసం చేశాడని వెల్దుర్తికి చెందిన చిన్న పుల్లయ్య ఫిర్యాదు చేశారు. నవభారత్ పామాయిల్ మొక్కల కోసం రూ.లక్ష తీసుకుని మోసం చేశాడని గూడూరు మండలం చనుగొండ్ల గ్రామానికి చెందిన గుడిసె గుంటప్ప ఫిర్యాదు చేశారు. నకిలీ విద్యార్హత, ఫ్యామిలీ మెంబర్స్ సర్టిఫికెట్లతో భాగ్యవతి అనే మహిళ మోసాలకు పాల్పడుతోందని కర్నూలు గణేష్ నగర్ చెందిన ఓ మహిళ ఫిర్యాదు చేశారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ ఎస్పీ హుశేన్ పీరా, సీఐలు శివశంకర్, రామకృష్ణ, రమేష్, విజయలక్ష్మి ఉన్నారు.

ఎంపీపీపై అవిశ్వాస తీర్మానం



కర్నూలు ఎంపీడీఓ కార్యాలయం

- నేడు మండల ప్రజా పరిషత్ సమావేశ భవనంలో ప్రత్యేక సమావేశం
- మండలంలో మొత్తం 19 ఎంపీటీసీ సభ్యులు
- టీడీపీకి 13మంది, వైసీపీకి ఆరుగురు
- ఉదయం 11 గంటలకు ఆర్డీవో అధ్యక్షతన సమావేశం
- పట్టు సాధిస్తున్న విష్ణువర్ధన్‌రెడ్డి, ఎమ్మెల్యే బొగ్గుల

కర్నూలు రూరల్, డిసెంబరు 1(ఆంధ్రజ్యోతి): కర్నూలు మండల ఎంపీపీ డి. వెంకటేశ్వరమ్మపై మంగళవారం అవిశ్వాస తీర్మానం ప్రవేశపెట్టనున్నారు. కర్నూలు ఆర్డీవో కిడారి సందీప్‌కుమార్ అధ్యక్షతన ఉదయం 11గంటలకు స్థానిక జిల్లా పరిషత్ ఆవరణలోని కర్నూలు మండల ప్రజా పరిషత్ సమావేశ భవనంలో ప్రత్యేక సమావేశం నిర్వహించనున్నారు. కర్నూలు మండలంలో మొత్తం 23 మంది ఎంపీటీసీ సభ్యులు ఉండగా పసుపుల ఎంపీటీసీ-1 మురళీకృష్ణ, జి. శింగవరం ఎంపీటీసీ సభ్యుడు సవారన్న మృతి చెందారు. పంచలింగాల ఎంపీటీసీ-1 బస్తిపాటి నాగరాజు సార్వత్రిక ఎన్నికల్లో టీడీపీ తరఫున కర్నూలు ఎంపీగా గెలిచి ఎంపీటీసీ పదవికి రాజీనామా చేశారు. అలాగే ఆర్. కొంతలపాడు ఎంపీటీసీ సభ్యురాలు కురువ గిడ్డమ్మ సుంకేసుల సర్పంచుగా గెలవడంతో ఆమె కూడా ఎంపీటీసీ పదవికి రాజీనామా చేశారు. కర్నూలు మండలంలో మొత్తం 23 ఎంపీటీసీలకు గాను నాలుగు స్థానాలు ఖాళీ అయ్యాయి. దాదాపు ఏడాది నుంచి రాష్ట్ర ఎన్నికల సంఘం ఖాళీ స్థానాలను భర్తీ చేయలేదు. మండలంలో ప్రస్తుతం 19 మంది ఎంపీటీసీ సభ్యులు మాత్రమే ఉన్నారు.

● గత నెల 7న ఆర్డీవోకు ఫారం-2 అందజేత

కర్నూలు మండలంలో మొత్తం 19 మంది ఎంపీటీసీ సభ్యులు ఉండగా వారిలో 13 మంది టీడీపీ ఎంపీటీసీ సభ్యులు ఎంపీపీపై అవిశ్వాస తీర్మానం పెట్టాలని కర్నూలు ఆర్డీవోను గత నెల 7వతేదిన ఫారం-2ను అందజేశారు. సభ్యుల కోరిక మేరకు ఆర్డీవో తన పైస్థాయి అధికారుల సూచనలతో మండలంలోని 19మంది ఎంపీటీసీ సభ్యులకు నోటీసులు ఇచ్చారు. మంగళవారం జరిగే అవిశ్వాస తీర్మానానికి తప్పకుండా హాజరు కావాలని ఆర్డీవో ఎంపీటీసీ సభ్యులకు ఆదేశాలు జారీ చేశారు. యాక్టు ప్రకారం ఆర్డీవో నోటీసులు ఇచ్చిన గడువు నుంచి 15 రోజులు పూర్తయిన తర్వాత అవిశ్వాసం పెట్టవచ్చు. నోటీసులు ఇచ్చి ఇప్పటికే దాదాపు 23 రోజుల పూర్తియింది.

మిగతా 6వ పేజీలో

పంటభద్రుడు



- వర్కూరులో పండిన ఖర్జూరం
- నాలుగు ఎకరాల్లో పండ్ల మొక్కల సాగు
- చేపలు, పీతల పెంపకం
- చౌడునేలలో ఉపాధ్యాయుడి విజయం

6

చౌడు నేలలో పంట చేతికందడమే గగనం. పైగా ఎడారిలో సాగయ్యే పండ్ల మొక్కలు నాటించడమా అంటూ ఆ మాస్టారి ప్రయత్నాన్ని ఎగతాళి చేశారు. పక్కనున్న రైతులంతా 'నీకేమైనా పిచ్చా? ఈ పంటలు ఎవరైనా ఇక్కడ పండిస్తారా..' అంటూ అవహేళనగా మాట్లాడారు. అయినా అవేమీ పట్టించుకోకుండా మాస్టారు తన పని తాను చేసుకుంటూ వెళ్లాడు. కానీ అలా మాట్లాడిన రైతులే ఇప్పుడు ముక్కున వేలేసుకుంటున్నారు. సాగుకు కొరగాని చౌడు నేలలో ఎడారి పంట ఖర్జూర పండించి నవ్విన నోళ్లకు తాళం వేశాడు. ఇపుడా మాస్టారి కృషికి అందరూ ప్రశంసలు కురిపిస్తున్నారు. మిగతా రైతులు చీడపురుగుల నివారణ కోసం వాడే ఫర్టిలైజర్స్ వంటివి వాడకుండా కేవలం సహజ సిద్ధమైన ఎరువులను వాడుతూ నాణ్యమైన, ఆరోగ్యవంతమైన దిగుబడిని తీసుకొస్తున్నారు. ఎలాంటి రసాయన ఎరువులు వాడకుండా ప్రకృతి సేద్య విధానంలో ప్రభుత్వ ఉపాధ్యాయుడు తిమ్మన్న సాధించిన విజయం ఇది..

- కోడుమూరు రూరల్ (ఆంధ్రజ్యోతి)

పంటభద్రుడు





- వర్కూరులో పండిన ఖర్జూరం
- నాలుగు ఎకరాల్లో పండ్ల మొక్కల సాగు
- చేపలు, పీతల పెంపకం
- పొట్టేళ్లు, కోళ్ల పెంపకానికి శ్రీకారం
- ప్రకృతి సేద్యంపై మక్కువ
- చౌడునేలలో ఉపాధ్యాయుడి విజయం

వ్యవసాయం

ఆయన ఖాతాలో ఐదు పీజీలు

ఉపాధ్యాయుడు తిమ్మన్న చిన్నతనంలో పేదరికం అనుభవించాడు. తల్లిదండ్రులకు పదిమంది సంతానం. పెద్దకుటుంబంలో కష్టాలు చూస్తూ పెరిగాడు. పేదరికాన్ని పారదోలడానికి విద్య ఒక్కటే ఆయుధమని తలచాడు. తన కలల సౌధం ఉపాధ్యాయ ఉద్యోగం సాధించినా, విద్యపై ఆసక్తి తగ్గలేదు. ఉపాధ్యాయ వృత్తి చేపట్టేనాటికి 1994-96లో ఎంఏ (టీఐఎస్ఎస్) పూర్తి కాగా, అనంతరం ఎమ్మెస్సీ, ఎంఏ (ఇంగ్లీషు), ఎంఈడీ, ఎంఫిల్ పూర్తయ్యాయి. ప్రస్తుతం ఆరో పీజీ (పొలిటికల్ సైన్స్) చదువుతున్నారు.

నాలుగెకరాల్లో వ్యవసాయం

గూడూరు మండలంలోని చనుగొండ్ల గ్రామానికి చెందిన తిమ్మన్న వర్కూరు ప్రాథమిక (మెయిన్) పాఠశాలలో ఉపాధ్యాయుడిగా విధులు నిర్వహిస్తున్నారు. ఉపాధ్యాయుడు తిమ్మన్న గత కొన్నేళ్ల కిందట వర్కూరు పెట్రోలు బంకు సమీపంలో నాలుగు ఎకరాల పొలం కొనుగోలు చేశారు. అందులో మొదటి ఏడాది సజ్జ సాగు చేపట్టారు. చౌడునేల కావడంతో దిగుబడి అంతంత మాత్రమే వచ్చింది. దీంతో నిరాశ చెందాడు. అయితే స్వతహాగా వ్యవసాయంపై మక్కువ ఉన్న తిమ్మన్న దృష్టి పండ్ల మొక్కలసాగుపై మళ్లింది. మరో అడుగు ముందుకేసి ఎడారి పంట ఖర్జూరం పండించాలని నిశ్చయించుకున్నాడు. తన ప్రయత్నాన్ని కొందరు రైతులు, మిత్రులతో పంచుకోగా తీవ్రంగా వ్యతిరేకించారు. చౌడునేలలో ఖర్జూర పంట పండుతుందా అంటూ ఫక్కున నవ్వేశారు.

పట్టువదలని విక్రమార్కుడిలా..

విమర్శలను పట్టించుకోని మాస్టారు హైదరాబాదు నుంచి బర్హి, మెడ్‌జూల్, ఖలాస్, హల్వి వంటి రకాల ఖర్జూర మొక్కలు సుమారు 200 కొనుగోలు చేసి పొలంలో వరుసలుగా నాటించాడు. వీటితో పాటు పొలంలో గట్టు వెంబడి 400 టెంకాయ చెట్లు మిగిలిన భూమిలో డ్రాగన్ ఫ్రూట్, సపోటా, దానిమ్మ, అరటి, జామ, ఉసిరి, వాటర్ ఆపిల్, స్టార్‌ఫ్రూట్, బాదం, అడవిబాదం, ద్రాక్ష, మల్బరీ, వాక్కాయ, అల్లనేరేడు, మునగ వంటి ఎన్నోరకాల మొక్కలు నాటించాడు. అలాగే సుమారు 20 సెంట్లలో చేపల పెంపకానికి గుంత తవ్వించాడు. ఇటీవలే పీతల పెంపకం ప్రయోగాత్మకంగా చేపట్టాడు. అంతేగాకుండా అజోల్లా గడ్డికి కొంత పొలం సిద్ధం చేసి ఉంచాడు. మరోవైపు పొట్టేళ్లు, కోళ్ల పెంపకానికి షెడ్డు నిర్మిస్తున్నారు. 5 హెచ్‌పీ మోటారు నడిచేలా సోలార్ ప్యానెల్ ఏర్పాటు చేయించాడు. తిమ్మన్న పాఠశాల విధుల అనంతరం, సెలవు రోజుల్లో మాస్టారు పొలం వద్ద కనిపిస్తారు. యజమాని, కూలీగా రెండు పనులు చేస్తూ సస్యరక్షణ చర్యలు, పర్యవేక్షణ చేస్తున్నాడు. తోటలో నిత్య పనులకు ఓ కుటుంబానికి ఉపాధి కల్పిస్తున్నారు. అంతేకాకుండా పంట చుట్టూ ఇనుప కంచె, సీసీ కెమెరాల పర్యవేక్షణ ఏర్పాటు చేశారు. రసాయనిక ఎరువులు, క్రిమిసంహారక మందులు పంట ఛాయలకు కూడా లేకుండా సేంద్రియ ఎరువులు మాత్రమే వినియోగిస్తున్నారు. మాస్టారి కృషి ఫలించింది. సుమారు నాలుగేళ్ల అనంతరం ఖర్జూర, దానిమ్మ, డ్రాగన్ ఫ్రూట్ చేతికందాయి. ఖర్జూర గెలలను చూసి మాస్టారి సంతోషానికి అవధులు లేవు. మొదటి ఏడాది రూ.లక్ష ఆదాయం పొందాడు. అంతేకాకుండా కొన్నాళ్ల క్రితం విజయవాడలో మేలుజాతి ఖర్జూర పండ్లను కొనుగోలు చేసి వాటి విత్తనాలను మొలకెత్తించాడు. దీంతో మొక్కలు పెంచడానికి కూడా ఎటువంటి ఇబ్బందులు లేవని, ఆ మొక్కలను సైతం అవసరమైన చోట నాటుతున్నట్లు మాస్టారు తెలిపారు.





విద్యార్థులకు పాఠాలు బోధిస్తూ...



పంటల కోసం సోలార్ ప్యానెళ్లు



ఆవులకు మేత వేస్తున్న తిమ్మన్న

ప్రకృతిని కాపాడుదాం

వ్యవసాయంలో సమగ్ర విధానం అందుబాటులోకి రావాలి. ఒకేరకమైన పంట సాగు, రసాయనిక మందులతో మేలు జరగదు. సేంద్రియ వ్యవసాయం, జీవామృతం వినియోగిస్తూ, అనుబంధ వ్యవసాయ ఉత్పత్తులపై దృష్టి సారించాలి. ప్రకృతిని మనం కాపాడితే అది మనల్ని రక్షిస్తుంది. రైతులకు అదే చెబుతున్నా. కొడుకు రూర్కీలో ఐఐటీ, కూతురు గ్రాడ్యుయేషన్ చదువుతున్నారు. సెలవులకు వచ్చిన ప్రతిసారి ప్రకృతి వ్యవసాయం ఆవశ్యకతను తెలియజేస్తున్నాను. ఇది ముందు తరాలకు ఎంతో అవసరం. నాలుగేళ్ల కృషి ఫలించింది.

- తిమ్మన్న, ఉపాధ్యాయుడు



సెలవు రోజుల్లో వ్యవసాయ పనులు

ముహూర్తాలకు బ్రేక్

- 3నెలల పాటు కొనసాగనున్న మూఢం
- 2026 ఫిబ్రవరి 17 తర్వాతే శుభకార్యాలు

కొలిమిగుండ్ల, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): సన్నాయి మేళాలు.. భాజా భజంత్రీలు.. డప్పు వాయిద్యాలు మూడు నెలలపాటు వినిపించవు. మూఢం కారణంగా తెలుగింట శుభకార్యాలకు శుభం కార్డు పడింది. దీంతో మూడు నెలల పాటు శుభకార్యాలు లేనట్టే. జ్యోతిష్య శాస్త్రం ప్రకారం శుక్రుడు అస్తంగత్వం పొందడం వల్ల మూఢం ఏర్పడుతుంది. ఈశుక్ర మౌఢ్యమి వల్ల 83 రోజులు(మార్గశిర శుద్ధ షష్టి మాఘ మాసం) వరకు ఎటువంటి శుభ కార్యాలు చేయడానికి వీలుపడదని వేద పండితులు చెబుతున్నారు. అంటే 2026 ఫిబ్రవరి 17వ తేదీ వరకు శుక్ర మౌఢ్యమి కొనసాగుతుంది. మూడు నెలల పాటు వివాహాది శుభ కార్యాలతో పాటు, గృహ ప్రవేశాలు, పుట్టు వెంట్రుకలు, ఇతర అన్ని రకాల శుభ కార్యాలు నిలిచిపోనున్నాయి.

ఇప్పట్లో మంచి రోజులు లేవు

మూడు నెలల పాటు ఎటువంటి శుభ ముహూర్తాలు లేవు. నవంబరు 26 నుంచే మూఢం ప్రారంభమైంది. ఈ మూఢం 2026 ఫిబ్రవరి 17 వరకు కొనసాగుతుంది. ఆ తర్వాతే పెళ్లి ముహూర్తాలు ఉన్నాయి.

- ఆలూరు రాఘవేంద్రప్రసాద్, వేద పండితులు

హెచ్ఐవీ బాధితులపై వివక్ష నేరం

- జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి లీలా వెంకట శేషాద్రి



కర్నూలు లీగల్, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): సమాజంలో హెచ్ఐవీ- ఎయిడ్స్ బాధితుల పట్ల వివక్ష చూపితే చట్ట ప్రకారం శిక్షార్హులు అవుతారని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి బి.లీలా వెంకట శేషాద్రి తెలిపారు. ప్రపంచ ఎయిడ్స్ నివారణ దినం సందర్భంగా సోమవారం స్థానిక న్యాయ న్యాయ సేవాసదన్‌లో జరిగిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. ఎయిడ్స్‌పై ప్రజల్లో అవగాహన కల్పించి అపోహలు తొలగించడానికి డిసెంబరు 1న ప్రపంచ వ్యాప్తంగా ఎయిడ్స్ నివారణ దినం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ వ్యాధిపై పోరాడటానికి హెచ్ఐవీ బాధితులకు మద్దతుగా నిలిచి వారికి మానసిక ఆరోగ్యంపై కౌన్సెలింగ్ ఇవ్వాల్సిన అవసరం ఉందని తెలిపారు. హెచ్ఐవీ బాధితులకు విద్య, ఆరోగ్యం, ఉద్యోగ సంరక్షణకు సహకరించాలని పిలుపునిచ్చారు. హెచ్ఐవీ వ్యాధిగ్రస్థులు అవసరమైన సహాయం పొందేందుకు టోల్‌ఫ్రీ నెంబర్ 15100కు కాల్ చేయవచ్చని తెలిపారు.

మెడికల్ పీజీ పరీక్షల్లో స్టేట్ ర్యాంకులు

కమ్యూనిటీ మెడిసిన్, ఫిజియాలజీలో స్టేట్ సెకండ్, థర్డ్ ర్యాంకులు



కీర్తన



డా.డి.మౌనిక



డా.ఆర్.ధరణి



డా.పి.యశ్వంత్

కర్నూలు హాస్పటల్, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): ఎన్టీఆర్ హెల్త్ యూనివర్సిటీ విడుదల చేసిన మెడికల్ పీజీ పరీక్ష ఫలితాల్లో కర్నూలు మెడికల్ కాలేజీ విద్యార్థులు సత్తా చాటారు. సోమవారం విడుదల చేసిన మెడికల్ పీజీ ఫైనల్ ఇయర్ పరీక్షల్లో కమ్యూనిటీ మెడిసిన్ నుంచి కొప్పోలు కీర్తన స్టేట్ సెకండ్, థియరీలో స్టేట్ ఫస్ట్ ర్యాంకు, ఫిజియాలజీ విభాగం నుంచి డా.డి. మౌనిక స్టేట్ ర్యాంకు, డా. యశ్వంత్ స్టేట్ థర్డ్ ర్యాంకు, ఫార్మకాలజీ విభాగం నుంచి డా. ఆర్ ధరణి స్టేట్ థర్డ్ ర్యాంకు సాధించారు. ఫిజియాలజీ విభాగంలో 0.3 శాతంతో స్టేట్ ఫస్ట్ ర్యాంకు, కమ్యూనిటీ మెడిసిన్ విభాగంలో రెండు మార్కులతో స్టేట్ ఫస్ట్ ర్యాంకులు మిస్ అయ్యాయని ప్రిన్సిపాల్ డా.కే. చిట్టి నరసమ్మ తెలిపారు. వచ్చే విద్యాసంవత్సరం పరీక్షల్లో ఉత్తమ ఫలితాలు సాధించడానికి కృషి చేయాలని హెచ్‌వో డీలను ఆదేశించారు. ఈ సందర్భంగా పీజీ ఫైనల్ ఇయర్ పరీక్షలో మంచి ఫలితాలు సాధించిన కమ్యూనిటీ మెడిసిన్ హెచ్‌వోడీ డా. సింధియ శుభప్రద, ఫిజియాలజీ హెచ్‌వోడీ డా. సుధారాణి, ఫార్మకాలజీ హెచ్‌వోడీ డా. రాజేష్‌లను ప్రిన్సిపాల్ అభినందించారు.

ఎంపీపీపై అవిశ్వాస తీర్మానం

(5వ పేజీ తరువాయి)

పంచాయతీరాజ్ 1994 యాక్ట్ ప్రకారమే ఎంపీపీపై అవిశ్వాస తీర్మానం పెడుతున్నట్లు ఎంపీటీసీ సభ్యులు చెబుతున్నారు. ప్రస్తుత ఎంపీపీ వెంకటేశ్వరమ్మ ఉల్చాల ఎంపీటీసీ సభ్యురాలుగా ఎన్నికై వైసీపీలో కొనసాగుతున్నారు. అయితే ఆమె అప్పటి ప్రభుత్వాన్ని అడ్డుపెట్టుకుని తోటి ఎంపీటీసీ సభ్యులకు ఒక్కరికి కూడ పైసా నిధులు ఇవ్వలేదనే ఆరోపణలు వున్నాయి. ఎంపీపీ తన స్వంత గ్రామానికి దాదాపు రూ.3కోట్లు దాకా నిధులన్నీ మళ్లించారనే విమర్శలు వ్యక్తమవుతున్నాయి. ఎంపీపీతో పాటు ఆమె భర్త వ్యవహార శైలితో సొంత పార్టీ ఎంపీటీసీ సభ్యులే తెరవెనక వ్యతిరేకిస్తున్నారనే వదంతులు ఉన్నాయి. ఆమె వ్యవహారం కోడుమూరు నియోజకవర్గ వైసీపీ పెద్దలకు కూడ మింగుడు పడటంలేదనే విమర్శలున్నాయి. దీంతో ఆ పార్టీలో ఇమడలేక నందనపల్లె, నూతన పల్లె, దిన్నెదేవరపాడు, గొందిపర్ల గ్రామాలకు చెందిన నలుగురు వైసీపీ ఎంపీటీసీ సభ్యులు టీడీపీలో చేరారు. దీంతో టీడీపీకి సంఖ్యా బలం 13కి చేరింది. వైసీపీకి కేవలం ఆరుగురు సభ్యులే ఉన్నారు. పంచాయతీరాజ్ యాక్టు ప్రకారం ఎంపీపీపై అవిశ్వాం పెట్టాలంటే కనీసం నాలుగేళ్లు పూర్తి కావాలి. ఆ లెక్కన ఎంపీటీసీ సభ్యులు కలి సి వైసీపీ ఎంపీపీ వెంకటేశ్వర్మపై అవిశ్వాసం పెట్టాలని ఆర్డీవోను కలిశారు. నేడు జరిగే ప్రత్యేక సమావేశంలో కొంతమంది వైసీపీ ఎం పీటీసీలు టీడీపీకి వైపు మొగ్గు చూపుతున్నట్లు తెలిసింది. మొత్తం 19మంది ఎంపీటీసీ సభ్యుల్లో రెండింట మూడో వంతు కోరం ఉండా లి. ఆ లెక్కన ఇప్పటికే టీడీపీకి తగినంత ఎంపీటీసీ సభ్యులు ఉన్నారు. ఈ సమావేశానికి వైసీపీ నాయకత్వం తమ ఎంపీటీసీల ను పంపిస్తుందా లేదా అనేది ప్రశ్నార్థకంగా మారింది. వైసీపీ ఎంపీపీ కోర్టుకు వెళ్లి స్టేఆర్డర్ కోసం తీవ్రంగా ప్రయత్నం చేసినట్లు తెలిసింది.

పట్టు నిలుపుకుంటున్న విష్ణు, బొగ్గుల

కర్నూలు మండల ఎంపీపీ స్థానంపై కేడీసీసీబీ చైర్మన్ విష్ణువర్ధన్‌రెడ్డి, కోడుమూరు ఎమ్మెల్యే బొగ్గుల దస్తగిరి పట్టునిలుపుకుంటున్నారు. వైసీపీ ప్రభుత్వ హయాంలో టీడీపీ సభ్యులను ఎంతో ఇబ్బందులకు గురిచేసిన వారి పీఠం కదిలిస్తున్నారు. గత నాలుగేళ్ల క్రితం జరిగిన కర్నూలు ఎంపీపీ ఎన్నికల్లోనే విష్ణు తనయుడు యువనేత రాజావర్ధన్‌రెడ్డి కీలకంగా వ్యవహరించారు. అధికారంలో ఉన్న వైసీపీకి ముచ్చెటమలు పట్టించారు. ఒకే ఒక ఓటుతో ఎంపీపీ పదవి చేజారిపోయింది. తదనంతరం రాజవర్ధన్‌రెడ్డి తండ్రి విష్ణువర్ధన్‌రెడ్డి రంగంలో దిగడంతో నేడు కర్నూలు ఎంపీపీ పీఠం టీడీపీ ఖాతాల్లో పడనుంది.

ప్రసాదం పవిత్రమైనది

- శ్రీశైలం ఆలయ ఈఓ శ్రీనివాసరావు
- ఉచిత లడ్డూ వితరణ కేంద్రం ప్రారంభం



ఉచిత లడ్డూ కేంద్రాన్ని ప్రారంభిస్తున్న చైర్మన్

శ్రీశైలం, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): శ్రీశైల మల్లన్న ఆలయ లడ్డూ ప్రసాదం ఎంతో పవిత్రమైనదని ఈఓ శ్రీనివాసరావు అన్నారు. అమృతతుల్యమైన లడ్డూ ప్రసాదాన్ని ఉచితంగా అందించే గొప్ప కార్యక్రమానికి ట్రస్టుబోర్డు శ్రీకారం చుట్టడం హర్షనీయమన్నారు. సోమవారం ఈఓతో పాటు పాలకమండలి చైర్మన్ రమేష్‌నాయుడు, ట్రస్ట్ బోర్డు సభ్యులు శ్రీగోకులం, ప్రధాన గోపురం వద్ద విరాళాల కేంద్రం, ఉచిత లడ్డూ వితరణ కేంద్రం, కైలాస కంకణాల విక్రయ కేంద్రాలను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఈఓ, చైర్మన్లు విలేకరులతో మాట్లాడుతూ భక్తులకు మెరుగైన వసతులు కల్పించేందుకే ప్రాధాన్యమిస్తున్నామన్నారు. స్పర్శ దర్శనం చేసుకున్నవారితోపాటు అతిశీఘ్ర దర్శనం చేసుకున్న భక్తులకు ఉచిత లడ్డూ ప్రసాదం అందుకున్న భక్తులు చాలా సంతోషాన్ని వ్యక్తం చేస్తున్నారన్నారు. హైదరాబాద్‌కు చెందిన సాయిశిల్ప్స్ కళామందిరం అధినేత నాగదుర్గాప్రసాద్ సహకారంతో శ్రీగోకులం ఆధునికీకరణ పనులు చేస్తున్నట్లు తెలిపారు. ఇదిలా ఉండగా ఏలూరుకు చెందిన వెంకట శివసాకేత్ వర్మ రూ.1,01,116 మొత్తాన్ని అన్నప్రసాదం కోసం విరాళంగా అందజేశారు. ఈ కార్యక్రమంలో పాలకమండలి సభ్యులు భరద్వాజశర్మ, వెంకట సుబ్బారావు, రమణమ్మ, లక్ష్మీశ్వరి, గంగమ్మ, పిచ్చయ్య, అనిల్‌కుమార్, కాశీనాథ్, సుబ్బలక్ష్మి, శివమ్మ, శ్రీదేవి, ప్రత్యేక ఆహ్వానితులు సుధాకర్‌రెడ్డి, వెంకటేశ్వర్లు, శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ బలోపేతానికి కృషి చేయండి

- ఏఐసీసీ సభ్యుడు, కర్ణాటక రాష్ట్ర ఎమ్మెల్యే హరీష్

డోన్ రూరల్/కోవెలకుంట్ల/ఆళ్లగడ్డ, డిసెంబరు 1 (ఆంధ్రజోతి): కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి కార్యకర్తలు సైనికుల్లా పని చేయాలని కాంగ్రెస్ పార్టీ ఏఐసీసీ పరిశీలకులు, బెంగళూరు నగరంలోని శాంతినగర్ ఎమ్మెల్యే ఎన్ఏ హరీష్ పిలుపునిచ్చారు. సోమవారం ఆయన బనగానపల్లె, డోన్, ఆళ్లగడ్డ నియోజకవర్గాల్లో సంఘటన్ సృజన్ అభియాన్ కార్యక్రమంలో భాగంగా కాంగ్రెస్ పార్టీ శ్రేణులతో సమీక్ష నిర్వహించారు. ఏఐసీసీ సభ్యుడు, జిల్లా అధ్యక్షుడు జంగిటి లక్ష్మీనరసింహ ఆధ్వర్యంలో ఆయా నియోజకవర్గాలో పర్యటించారు. పరిశీలకులు, శాంతినగర్ ఎమ్మెల్యే హరీష్ మాట్లాడుతూ దేశం కోసం ఇందిరాగాంధీ, రాజీవ్‌గాంధీలు ప్రాణత్యాగం చేశారన్నారు. కాంగ్రెస్‌లో యువతను ప్రోత్సహించేందుకు సంఘటన్, సృజయాన్ అభియాన్ కార్యక్రమం చేపట్టినట్లు తెలిపారు. జిల్లాలో డీసీసీ పదవి కోసం ఆసక్తి ఉన్న వారి నుంచి దరఖాస్తులు తీసుకోవడం జరుగుతుందన్నారు. దేశంలో కాంగ్రెస్ ఎప్పటికీ బలహీనపడదని స్పష్టం చేశారు. దేశవ్యాప్తంగా కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి కాంగ్రెస్ దేశ అధినేత రాహుల్ గాంధీ 4వేల కిలోమీటర్లకు పైగా పాదయాత్ర చేపట్టిన విషయాన్ని ఆయన గుర్తు చేశారు. వచ్చే స్థానిక సంస్థల ఎన్నికల్లో కాంగ్రెస్ పోటీ చేస్తుందన్నారు. ఏఐసీసీ సభ్యుడు లక్ష్మి నరసింహ యాదవ్ మాట్లాడుతూ రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ బలోపేతం అవుతోందన్నారు. రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అన్ని స్థానాల్లో పోటీ చేస్తుందన్నారు. పార్టీ కేడర్ ఏకమై ఎన్నికల్లో సత్తా చాటాలన్నారు. కాంగ్రెస్ పార్టీ పూర్వ వైభవానికి తాను శాయశక్తులా కృషి చేస్తానని, అందుకు శ్రేణుల సహకారం ఉండాలని కోరారు. ఈ సమావేశంలో డోన్, బనగానపల్లె, ఆళ్లగడ్డ సమన్వయ కర్తలు గార్లపాటి మద్దిలేటి, బాలు యాదవ్, బరుగొడ్ల హుసేన్ బాషా, కాంగ్రెస్ ఏపీసీసీ ప్రధాన కార్యదర్శి ఈ.సుధాకర్ రెడ్డి, రాష్ట్ర మైనార్టీ అధ్యక్షుడు హఫీజ్ శంశుల్ హక్, ఉపాధ్యక్షుడు మౌలానా అబ్దుల్ మజీద్, సుమిత్ర, అసంఘటిత ఉద్యోగుల సంఘం రాష్ట్ర చైర్మన్ వెంకట కృష్ణారెడ్డి, డీసీసీ ఉపాధ్యక్షులు మల్లెంపల్లె జనార్దన్, నాగమధుయాదవ్ తదితరులు పాల్గొన్నారు.



డోన్‌లో పర్యటిస్తున్న కర్ణాటక ఎమ్మెల్యే ఎన్ఏ హరీష్, కాంగ్రెస్ పార్టీ శ్రేణులు

నిర్లక్ష్యపు నీడలో

ఉర్దూ వర్సిటీ!

(5వ పేజీ తరువాయి)



ఉర్దూ విశ్వవిద్యాలయం ప్రధాన రోడ్డు దుస్థితి ఇదీ..

మంత్రి భరత్ రూ. కోటి విరాళం



అసంపూర్తిగా ఉన్న జీ ప్లస్ 1 అకడమిక్ బ్లాక్, హాస్టల్ భవనాలు పూర్తి చేసి వర్సిటీని ఓర్వకల్లుకు మారిస్తే.. ఆ తర్వాత క్రమక్రమంగా అభివృద్ధి చేయవచ్చని అధికారులు సంకల్పించారు. ఆ పనుల పూర్తికి తక్షణం రూ.2 కోట్ల నిధులు అవసరం. ఈ విషయాన్ని జిల్లాకు చెందిన మంత్రి టీజీ భరత్, కలెక్టర్ డాక్టర్ ఏ.సిరితో వర్సిటీ అధికారులు చర్చించారు. స్పందించిన మంత్రి.. రూ.కోటి విరాళంగా ఇస్తానని, తక్షణమే అవసరమైన పనులు మొదలు పెట్టమని వారికి సూచించారు. మరో రూ.కోటి ప్రభుత్వం నుంచి రాబట్టేందుకు కలెక్టర్ సిరి, పాణ్యం ఎమ్మెల్యే గౌరు చరితలు ప్రత్యేక చొరవ తీసుకున్నారు. రూ.50 లక్షలతో ఏపీ టూరిజం శాఖకు చెందిన హరిత హోటల్‌కు ఎదురుగా అప్రోచ్ నిర్మాణానికి శ్రీకారం చుట్టారు. ఉమ్మడి కర్నూలు జిల్లాకు చెందిన మంత్రులు, ఎంపీలు, ఎమ్మెల్యేలు వర్సిటీ నిర్మాణం పూర్తి విషయాన్ని సీఎం చంద్రబాబు, మంత్రి లోకేశ్ దృష్టికి తీసుకెళ్లి.. ఆ దిశగా కృషి చేయాలని పలువురు కోరుతున్నారు.

ప్రతిపాదించిన నిర్మాణాలు, రహదారులు, ప్రహరీ, తాగునీరు వంటి సౌకర్యాల కోసం రూ.25 కోట్లు వ్యయం అవుతుందని అంచనా వేస్తున్నారు.

క్యాప్టివ్ గ్రాంట్ అకౌంట్ క్లోజ్ చేయడంతో..

విశ్వవిద్యాలయాలకు ఏటేటా ప్రభుత్వం కేటాయించే నిధులు రావాలంటే 'క్యాప్టివ్ గ్రాంట్ అకౌంట్' కీలకం. 2024-25 బడ్జెట్‌లో రాష్ట్ర ప్రభుత్వం రూ.1.50 కోట్లు నిధులు కేటాయించింది. కానీ ఆ నిధులు మంజూరు చేయలేదు. గత వైసీపీ ప్రభుత్వ హయాంలో క్యాప్టివ్ గ్రాంట్ అకౌంట్‌ను క్లోజ్ చేయడమే ఇందుకు కారణం. అకౌంట్‌ను ఓపెన్ చేసి నిధులు ఇవ్వాలని ఉన్నత విద్యా శాఖ ద్వారా పంపిన ప్రతిపాదనలు ఆర్థిక శాఖ వద్ద పెండింగ్‌లో ఉన్నాయి. పెండింగ్ ఫైల్‌ను క్లియర్ చేసి, వర్సిటీ అభివృద్ధి పాటుపడాలని విద్యార్థి సంఘాల నాయకులు డిమాండ్ చేస్తున్నారు.

తారస్థాయికి 'ఆదోని జిల్లా' ఉద్యమం..!

- రోడ్డెక్కిన ఉద్యోగులు, ఉపాధ్యాయులు
- మద్దతు పలికిన వ్యాపారులు
- కొనసాగుతున్న రిలే నిరాహార దీక్షలు, ఆందోళనలు



ఛాంబర్ ఆఫ్ కామర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ర్యాలీ

కర్నూలు, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): పశ్చిమ ప్రాంత ప్రజలు ఆదోని జిల్లా సెంటిమెంట్‌ను బలంగా వినిపిస్తున్నారు. జిల్లా సాధన కోసం ఉద్యమ జోరు పెంచారు. తమ పిల్లల భవిష్యత్తు.. కరువు పల్లెసీమలు అభివృద్ధికి ప్రత్యేక జిల్లానే ఇంధనమని ఆందోళనలు ఉధృతం చేస్తున్నారు. సోమవారం ఆదోని జిలా సాధన లక్ష్యంగా ఉద్యోగులు, ఉపాధ్యాయులు, వ్యాపారులు రోడ్డెక్కారు. రిలే నిరాహార దీక్షలు, ధర్నాలు, ర్యాలీలు, వినూత్న నిరసన కార్యక్రమాలు పెద్దఎత్తున కొనసాగాయి. ఆదోని జిల్లా సాధిస్తాం.. అనే నినాదాలతో పురవీధులు దద్దరిల్లాయి. మరోవైపు ప్రజాప్రతినిధులు, రాజకీయ నాయకులకు ఉద్యమ సెగ తాకింది. ఆదోని జిల్లా, పెద్దతుంబళం కేంద్రంగా మండలం ఏర్పాటు చేయాలంటూ రెండు రోజుల క్రితం ఎమ్మెల్యే డాక్టర్ పార్థసారథి ఇంటిని ముట్టడించారు.

నాయకుల నిర్లక్ష్యం..

ఆదోని జిల్లా డిమాండ్ ఈనాటిది కాదు. 1952లో భాషా సంయుక్త రాష్ట్రాలు ఏర్పాటు సమయంలోనే బీజం పడింది. ఓల్డ్ ఆదోని డివిజన్ నియోజకవర్గాలు కలుపుతూ ప్రత్యేక జిల్లా చేయాలని పశ్చిమ ప్రాంత ప్రజల 73 ఏళ్ల సెంటిమెంట్ ఇది. 1968-68లో ప్రకాశం జిల్లా ఏర్పాటు సమయంలో అనంతపురం జిల్లా గుంతకల్లు, ఆదోని డివిజన్లను కలుపుతూ ఆదోని జిల్లా చేయాలనే డిమాండ్‌ను నాటి రాజకీయ నేతలు తొక్కిపెట్టారు. గత వైసీపీ ప్రభుత్వం 2022 ఏప్రిల్‌లో 13 జిల్లాను విభజించి 26 జిల్లాలు చేసింది. అప్పట్లో ఆదోని జిల్లా కోసం అప్పటి ఎమ్మెల్యేలు ఏ మాత్రం ప్రయత్నాలు చేయలేదు. సరిగ్గా వైసీపీ నేతల పంథాలోనే కూటమి నేతలు సైతం మౌనం వహిస్తున్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక జిల్లాలు, డివిజన్లు, మండలాల పునర్విభజన కోసం మంత్రివర్గ ఉప సంఘాన్ని నియమించింది. జిల్లా సాధన కోసం ప్రజా సంఘాలు రోడ్డెక్కినా ప్రజాప్రతినిధులు, రాజకీయ నాయకులు సీఎం చంద్రబాబు వద్ద గట్టిగా వాదన వినిపించడంలో విఫలమయ్యారు. 'ఆదోని జిల్లా తెస్తాం.. ప్రాణాలైనా అర్పిస్తాం..' అంటూ నాలుగు సినిమా డైలాగ్‌లు చెప్పిన నేతలు ఇప్పుడు మిన్నకుండిపోవడం పలు విమర్శలకు తావిస్తోంది. అధికార పార్టీ ప్రజాప్రతినిధులు అలసత్వం, నిర్లక్ష్యమే ఆదోనికి జిల్లా హోదా దక్కలేదని సర్వత్రా విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

పాలన సౌలభ్యం

ప్రస్తుతం పశ్చిమ ప్రాంతం గ్రామాల ప్రజలు జిల్లా కేంద్రం కర్నూలుకు రావాలంటే 100-150 కిలోమీటర్లు ప్రయాణం చేయాల్సి ఉంటుంది. ఆర్టీసీ బస్సులో వచ్చి పనులు చేసుకొని వెళ్లాలంటే ఒక రోజు సరిపోదు. దీంతో వ్యయప్రయాసాలు తప్పడం లేదు. అంతే కాదు వివిధ శాఖ జిల్లా అధికారుల పర్యవేక్షణ నామమా త్రంగా ఉంది. అదే ఆదోని జిల్లా చేస్తే చట్టూ ఉన్న నాలుగు నియోజ కవర్గాల కేంద్రాలకు 26-48 కిలోమీటర్లలోపే. అదే శివారు గ్రామాల నుంచి కూడా 45-50 కిలో మీటర్లకు మించదు. జిల్లా యంత్రాంగం పర్యవేక్షణ ఎంతో సులభతరమై ప్రజలకు మెరుగైన పాలన, సౌకర్యాలు అందుతాయి. పశ్చిమ కరువు ప్రాంతం ప్రత్యేక జిల్లా అయితే ప్రగతి పరుగులు పెట్టే అవకాశం లేకపోలేదు.

జోరందుకున్న ఉద్యమం..

గెజిట్ నోటిఫికేషన్‌లో ఆదోని జిల్లా పేరు లేదని తెలిసి రాజకీయ నాయకులు ఒక్కొక్కరుగా గొంతెత్తుతున్నారు. ప్రజల్లో సెంటిమెంట్ బలపడి జిల్లా సాధన పోరాటం వేగం పుంజుకుంది. సోమవారం ఛాంబర్ ఆఫ్ కామర్స్ అధ్యక్షుడు విట్టా సతీశ్, ఆదోని షరాఫ్ మర్చంట్ అసోసియేషన్ కార్యదర్శి దీపక్, ఆదోని అగ్రి ఇన్పుట్ డీలర్స్ అసోసియేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు అశోకానందారెడ్డి, స్థానిక అధ్యక్షుడు ఎర్రిస్వామి, ప్రజా సంఘాలు, విద్యార్థి, ఉద్యోగ, ఉపాధ్యాయ సంఘాలు జాయింట్ యాక్షన్ కమిటీ (జేఏసీ) నాయకులు, ఆదినారాయణరెడ్డి, లలితా జితేంద్ర, నూర్ అహ్మద్, రాఘురామయ్య, కృష్ణమూర్తి గౌడ్, కోదండ, రాజకీయ పార్టీల జేఏసీ నాయకులు విట్టా రమేశ్, చంద్రకాంత్‌రెడ్డి, దేవిశెట్టి ప్రకాశ్, వీరేశ్, తిరుమలేశ్, దస్తగిరి తదితరుల ఆధ్వర్యంలో నిరసనలు చేపట్టారు. అదే క్రమంలో ఆదోని మండలాన్ని నాలుగు మండలాలుగా విభజించాలని, పెద్దతుంబళం కేంద్రంగా మరో మండలం ఏర్పాటు చేయాలని డిమాండ్ చేస్తున్నారు. పెద్దహరివాణం మండలంలోకి తమ గ్రామాలను చేర్చకూడదంటూ పలు గ్రామాల ప్రజలు సబ్ కలెక్టర్ కార్యలయం వద్ద ఆందోళన చేశారు. కలెక్టరేట్‌లోని ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదికకు వచ్చి కలెక్టర్ సిరికి వినతి పత్రం అందజేశారు.

నియోజకవర్గ కేంద్రాల నుంచి కర్నూలు, ఆదోనికి ఉన్న దూరం కిలోమీటర్లలో..		
నియోజకవర్గ కేంద్రం	కర్నూలు	ఆదోని
ఆదోని	102	--
ఆలూరు	125	26
ఎమ్మిగనూరు	73	28
మంత్రాలయం	95	48
పత్తికొండ	85	38


విద్యార్థి, ఉపాధ్యాయ, ఉద్యోగ, ప్రజా సంఘాల ఆధ్వర్యంలో రాస్తారోకో

సీఎం చంద్రబాబును ఒప్పించగలరా?

గతంలో కర్నూలు నగరానికి సమీపంలో ఉన్న డోన్, నందికొట్కూరు నియోజకవర్గాలను నంద్యాల జిల్లాలో కలిపారు. మమ్ములను కర్నూలు జిల్లాలోనే ఉంచాలని ఆ రెండు నియోజకవర్గాల ప్రజలు ఇప్పటికీ కోరుతున్నారు. డోన్ నియోజకవర్గాన్ని కర్నూలు జిల్లా చేర్చాలని ఎమ్మెల్యే కోట్ల సూర్యప్రకాశ్‌రెడ్డి ప్రభుత్వానికి లేఖ కూడా రాశారు. నంద్యాల జిల్లా నుంచి ఆ రెండు నియోజకవర్గాలు విడదీసి కర్నూలు, కోడుమూరు, డోన్, నందికొట్కూరు, పాణ్యం (రెండు మండలాలు) నియోజకవర్గాలను కలుపుతూ కర్నూలు జిల్లా, ఓల్డ్ రెవిన్యూ డివిజన్ అయినా ఆదోని కేంద్రంగా ఆదోని, ఎమ్మిగనూరు, మంత్రాలయం, ఆలూరు, పత్తికొండ నియోజకవర్గాలను కలుపుతూ ఆదోని జిల్లా చేస్తే పాలన పరంగా ప్రజలకు సౌకర్యంగా ఉంటుంది. దీనిపై సీఎం చంద్రబాబును ఒప్పిస్తేనే సాధ్యం అవుతుంది. అది సాకారం కావాలంటే రాజకీయాలు, వర్గవిభేదాలు కాస్త పక్కన పెట్టి ఎమ్మెల్యేలు రంగంలోకి దిగాలి. ఎమ్మెల్యేలు డాక్టర్ పార్థసారథి, బీవీ జయనాగేశ్వరరెడ్డి, కేఈ శ్యాంబాబు, టీడీపీ ఇన్‌చార్జిలు మాజీ ఎమ్మెల్యే కె.మీనాక్షినాయుడు, ఎన్.రాఘవేంద్రరెడ్డి, వైకుంఠం జ్యోతి సహా వైసీపీ ఎమ్మెల్యేలు వై.బాలనాగిరెడ్డి, బి.విరూపాక్షి సహా ఆయా పార్టీల ముఖ్య నాయకులు జట్టుగా సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్‌కళ్యాణ్, మంత్రి నారా లోకేశ్ సహా మంత్రివర్గ ఉప సంఘాన్ని కలసి ఒత్తిడి తీసుకురావాలి. అప్పుడే జిల్లా స్వప్నం సాకారం అయ్యేందుకు అవకాశాలు ఎక్కువగా ఉన్నాయి.

చిరుతల సంచారం

- భయాందోళనలో చనుగొండ్ల గ్రామస్థులు

డోన్ టౌన్, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): మండలంలోని చనుగొండ్ల గ్రామ సమీపాన ఉన్న కొండపై రెండు చిరుతలు సంచరిస్తు న్నాయి. దీంతో గొర్రెల కాపరులు, గ్రామ ప్రజలు భయాందోళ నలు చెందుతున్నారు. సోమవారం గొర్రెల కాపరి మేకలను మేపేం దుకు వెళ్లగా.. సాయంత్రం రెండు చిరుత పులులు కనప డంతో ఫొటోలు తీసి అటు వైపు వెళ్లకుండా జాగ్రత్త పడ్డాడు. రెండు పులులు వున్న దృశ్యాలు సోషల్ మీడియాలో వైరలయ్యాయి. చిరుత పులి ఓ మూగజీవంపైదాడి చేసినట్లు స్థానికులు తెలుపుతు న్నారు. అటవీ శాఖ అధికారులు స్పందించి చిరుత పులులను అడ వుల్లోకి పంపించాలని కోరుతున్నారు.


చనుగొండ్ల కొండపై చిరుత పులి

బీఎస్సీ నర్సింగ్‌లో సీటు రాలేదని..

- విద్యార్థి ఆత్మహత్య

కర్నూలు క్రైం, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): బీఎస్సీ నర్సింగ్ కోర్సులో సీటు రాలేదని ఓ విద్యార్థి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. వివరాల మేరకు.. త్రీటౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలోని నాగిరెడ్డి రెవెన్యూ కాలనీలో సాయి రోషన్ (20) ఇటీవలే బీఎస్సీ నర్సింగ్ ఎంట్రెన్స్ రాశాడు. మొదటి విడత కౌన్సెలింగ్‌లో సీటు రాలేదు. రెండో విడత కౌన్సెలింగ్ ఫలితాలు సోమవారం వచ్చాయి. అందులో కూడా సీటు రాకపోవడంతో మనస్తాపానికి గురై ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఉరి వేసుకున్నాడు. తల్లిదండ్రులు గుర్తించి ఆసుపత్రికి తరలించగా.. అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు తెలిపారు. తండ్రి మస్తాన్‌రావు ఐసీఐసీఐ బ్యాంకులో ఉద్యోగిగా పని చేస్తున్నాడు. త్రీటౌన్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

అటకాయించి దోపిడీ యత్నం..

- దుండగురాలిని పట్టుకున్న స్థానికులు

కర్నూలు క్రైం, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): త్రీటౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలో ఓ మహిళను కత్తితో బెదిరించి గొలుసు తెంపుకుని పారిపోతున్న దుండగురాలిని స్థానికులు పట్టుకుని పోలీసులకు అప్పగించారు. వివరాల మేరకు.. చంద్రశేఖర్ నగర్‌లో శంకర్ రెడ్డి భార్య దేవమ్మ రేషన్ బియ్యం తీసుకుని తిరిగి ఇంటికి వెళ్తుండగా అటువైపు వచ్చిన ఓ దుండగురాలు దేవమ్మను అటకాయించి కత్తితో బెదిరించి, ఆమెపై దాడిచేసి కిందపడేసి మెడలోని గొలసును తెంపుకుని పరారయ్యే ప్రయత్నం చేసింది. గమనించిన స్థానికులు అప్రమత్తమై దుండగురాలిని పట్టుకుని పోలీసులకు అప్పగించారు. పోలీసులు దుండగురాలిని అదుపులోకి తీసుకుని విచారించగా జోహరాపురానికి చెందిన పాతనేరస్థురాలిగా గుర్తించారు. బాధితురాలి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేసున్నారు.

పాతాళగంగలో నీటి కుక్కల బెడద

- ఒడ్డున ఉన్న యాత్రికులపై దాడి.. నలుగురికి గాయాలు

శ్రీశైలం, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): పాతాళగంగ వద్ద ఒడ్డున నిలుచుని స్నానాలు చేస్తున్న యాత్రికులపై నీటి కుక్కలు దాడి చేస్తున్నాయి. హైదరాబాద్ నుంచి వచ్చిన యాత్రికులను సోమవారం తెల్లవారుజామున నీటి కుక్కలు గాయపరిచాయి. శ్రీశైలం రోప్‌వే సమీపంలో నివసించే యువకుడిపై కుడా నీటి కుక్కలు దాడి చేసినట్లు స్థానికులు తెలిపారు. కృష్ణా నదిలోని చేపలను వేటాడి జీవించే నీటి కుక్కలు అక్టోబరు, నవంబరు నెలల్లో జల ఉధృతి ఎక్కువగా ఉన్నప్పుడు ఒడ్డు వైపునకు వస్తుంటాయి. ఈ సంవత్సరం ఏకంగా ఒడ్డు పైకి కూడా వచ్చి నలుగురు యాత్రికులను గాయపరిచాయి. దీంతో పాతాళగంగకు వెళ్లాలంటే భక్తులు ఆందోళన చెందుతున్నారు. నీటి కుక్కలుగా స్థానికులు అట్టర్ అని పిలుస్తారని ఫారెస్ట్ అధికారులు తెలిపారు. కృష్ణా తీర ప్రాంతాలే వీటి ఆవాస స్థలాలని తెలిపారు. నీటిలో పడేసే కొబ్బరి చిప్పలు, అరటి దొన్నెలు, పూలు, వత్తులను తినేందుకు ఒడ్డుకు వచ్చే చేపల కోసం నదిలో తిరుగాడే నీటి కుక్కలతో అప్రమత్తంగా ఉండాలని సూచించారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి దుర్మరణం

పాములపాడు, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): ట్రాక్టర్, మోటారు సైకిల్ ఢీకొనడంతో వ్యక్తి దుర్మరణం చెందాడు. ఈ ఘటన మండలం లోని క్రిష్ణరావుపేట హైవే వద్ద సోమవారం చోటు చేసుకున్నది. పోలీసుల వివరాలిలా.. ఆత్మకూరు విద్యుత్‌శాఖలో ఏడీఏ విభా గంలో జూనియన్ అసిస్టెంట్‌గా వసీం అక్రం(35) విధులు నిర్వహిం చేవాడు. మోటారుసైకిల్‌పై ఆత్మకూరు నుంచి సోమవారం రాత్రి కర్నూలు వెళ్తుండగా క్రిష్ణరావుపేట సమీపంలో ట్రాక్టర్‌ను ఢీకొన్నది. దాంతో అక్కడిక్కడే మృతి చెందాడు. మృతుడికి భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నట్లు సమాచారం. పోలీసులు కేసు నమోదు చేసుకున్నారు.

మహిమగల దేవత చౌడేశ్వరీమాత

- నందవరం ఆలయ అభివృద్ధికి కృషి : మంత్రి బీసీ
- చైర్మన్‌గా పీవీ నాగార్జున రెడ్డి ప్రమాణస్వీకారం


చైర్మన్‌గా పీవీ నాగార్జునరెడ్డి, పాలకవర్గ సభ్యుల ప్రమాణస్వీకారం


చైర్మన్‌ను అభినందిస్తున్న మంత్రి బీసీ దంపతులు

బనగానపల్లె, డిసెంబరు 1(ఆంధ్రజ్యోతి): జిల్లాలోని ప్రముఖ శక్తిక్షేత్రంగా విరాజిల్లుతున్న నందవరం చౌడేశ్వరీ మాత మహిమగల దేవత అని రాష్ట్ర రోడ్లు, భవనాల శాఖ మంత్రి బీసీ జనార్దన్ రెడ్డి అన్నారు. నందవరం ఆలయ అభివృద్ధికి కృషి చేస్తానని ఆయన స్పష్టం చేశారు. సోమవారం నందవరం చౌడేశ్వరీ అమ్మవారి ఆలయ ప్రాంగణంలో ఆలయ చైర్మన్‌గా పీవీ నాగార్జున రెడ్డి ప్రమాణ స్వీకారోత్సవం ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా మంత్రి బీసీతో పాటు ఆయన సతీమణి బీసీ ఇందిరమ్మ హాజరయ్యారు. ముందుగా మంత్రితో పాటు పాలకమండలి సభ్యులు అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం చైర్మన్‌గా పీవీ నాగార్జున రెడ్డి, పాలకవర్గ సభ్యులుగా చింతా శ్రీనివాసులు, ఇనకండ్ల సుదర్శనరావు, ఎర్రజోడు లోకేశ్, కుమ్మరి శ్రీనివాసులు, ముక్కర హారిక, బొంతల శశికళ, ఉట్టి శారద, తప్పెట కుళాయమ్మ, చెర్వుపల్లె రాజేశ్వరి, డి.బాల దస్తగిరి, ఎక్స్ అఫిషియో సభ్యు లుగా కాసుల నాటి రామకృష్ణలతో అసిస్టెంట్ కమిషనర్ నల్లకాల్వ శ్రీనివాసరెడ్డి ప్రమాణ స్వీకారం చేయించారు. మంత్రి బీసీ మాట్లాడుతూ గతంలో పనిచేసిన పీవీ కుమార్‌రెడ్డి నేతృత్వంలో చౌడేశ్వరీమాత ఆలయంలో మూడు ఆలయ గోపురాలు పూర్తయ్యాయన్నారు. నూతన కమిటీ ఆధ్వర్యంలో కల్యాణమండపం పూర్తి కావాలని ఆకాంక్షించారు. నందవరం ఆలయానికి చైర్మన్లుగా పీవీ సుబ్బారెడ్డి, పీవీ కుమార్‌రెడ్డి, పీవీ నాగార్జునరెడ్డిలు మూడు తరాలుగా పనిచేయడం అభినందనీయమన్నారు. ఆలయ చైర్మన్ పీవీ. నాగార్జునరెడ్డి పీవీ కుమార్‌రెడ్డి మాట్లాడుతూ ఆలయాభివృద్ధికి మంత్రి సహకారం ఎనలేనిదన్నారు. అమ్మవారి ఆశీర్వాదంతో ముందుకు వెళతామన్నారు. గ్రామంలో సీసీ రోడ్లు కావాలని మంత్రిని కోరగా మంత్రి తప్పక అవసరమైన చోట రోడ్లు వేస్తామని హామీ ఇచ్చారు. బీసీ ఇందిరమ్మ మాట్లాడుతూ అమ్మవారి ఆలయం ప్రాశస్త్యాన్ని కాపాడుతూ ఆలయ అభివృద్ధికి కృషి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో బనగానపల్లె మండల టీడీపీ అధ్యక్షుడు పీవీ.కుమార్‌రెడ్డి, మాజీ ఎంపీపీ అంబాల రామకృష్ణారెడ్డి, మార్కెట్‌యార్డు చైర్మన్ కాట్రెడ్డి మల్లికార్జునరెడ్డి, జిల్లెళ్ల రాజశేఖర్‌రెడ్డి, ధర్మవరం నాగరాజు, వెంగన్న, రిటైర్డు హెచ్‌ఎం సుధాకర్‌రెడ్డి పాల్గొన్నారు.

వీధి కుక్కల దాడి.. ఇద్దరికి గాయాలు

ఎమ్మిగనూరు టౌన్, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని ఎస్సీ కాలనీకి చెందిన రంగస్వామి, భాస్కర్‌లపై వీధి కుక్కలు దాడి చేసి గాయపరిచాయి. ఆదివారం రాత్రి పని ముగించుకొని ఇంటికి వెళ్తున్న సమయంలో వారిద్దరిపై ఒక్క సారిగా చేసి ఇరువురిని గాయపరిచాయి. ప్రక్కనే ఉన్న కాలనీ వాసులు వాటిని తరిమి వారిని రక్షించారు. అక్కడి కాలనీ వాసులు వారిని వెంటనే చికిత్స ఆసుపత్రికి తీసుకెళ్ళారు. దీంతో పట్టణ ప్రజలు కుక్కల బెడద వలన రోజు రోజుకు బెంబేలెతుత్తున్నారు. రోడ్లపైకి రావాలంటే ప్రజలు భయభ్రాంతులకు గురవుతున్నారు. రాత్రి పూట గుంపులుగా తిరుగుతూ ద్విచక్ర వాహనదారుల వెంటపడటం, పిల్లలపై దాడి చేయడం వంటివి జరుగుతున్నాయని అంటున్నారు. దీంతో సుప్రీం కోర్టు కూడా వీధి కుక్కల విషయంలో కఠినంగానే వ్యవహరిస్తోంది స్టెరిలైజేషన్ చేసి వాటిని తిరిగి అక్కడ వదలకుండా ఆశ్రయాలకు తరలించాలని ఆదేశించింది, ఇప్పటికైనా అధికారులు చర్యలు చేపట్టి వీధి కుక్కలను కట్టడి చేయాలని ప్రజలు కోరుతున్నారు.

వృద్ధురాలి మృతి

ఎమ్మిగనూరు, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కొటేకల్లు, ఆరేకల్లు గ్రామాల మధ్య శనివారం తెల్లవారు జామున జరిగిన రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన గంగమ్మ(70) కర్నూలు ఆసుపత్రిలో చికిత్స పొందుతూ సోమవారం మృతి చెందింది. గత నెల 27వ తేదీన కర్ణాటకలోని కోలార్ జిల్లాకు చెందిన సతీష్‌కుటుంబ సభ్యులు రాఘవేంద్రస్వామి దర్శనార్థం కారులో ఇద్దరు చిన్నారులతో పాటు ఐదు మంది కుటుంబ సభ్యులు బయల్దేరారు. 28వ తేదీ శనివారం తెల్లవారు కొటేకల్లు, ఆరెకల్లు గ్రామాల మధ్య జరిగిన ఘోర రోడ్డు ప్రమాదంలో కారులో ఉన్న సతీష్‌తో పాటు భార్య మీనాక్షి, కుమారుడు రిత్విక్, సతీష్ మామ వెంకటేషప్ప, మేనల్లుడు బన్నిత్‌గౌడ్‌లు అక్కడిక్కడే మృత్యువాత పడ్డారు. ఈ ప్రమాదంలో సతీష్ అత్త గంగమ్మతో పాటు కారు డ్రైవింగ్ చేస్తున్న చేతన్‌లకు తీవ్ర గాయాలయ్యాయి. వీరిని కర్నూలు ఆసుపత్రికి తరలించగా అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందింది. చేతన్ చికిత్స పొందుతున్నారు. కాగా మృతుల సంఖ్య ఆరుకు చేరింది.

ఇదో రకమైన మోసం..

- ఛేదించిన పెద్దకడబూరు ఎస్ఐ
- జేసీబీల కొనుగోలు, అమ్మకాలతో అక్రమాలకు పాల్పడిన నిందితులు


పెద్దకడబూరులో నిందితులను చూపుతున్న డీఎస్పీ భార్గవి

పెద్దకడబూరు, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): కంప్యూటర్ కాలంలో రోజుకో మోసం వెలుగు చూస్తునే ఉంది..ఓ వైపు చదువుకున్న వాళ్లు సైబర్ నేరాలకు పాల్పడుతుంటే.. మరో వైపు చదువులేని వాళ్లు కూడా వారి తరహాలోనే మోసాలు చేస్తూ అక్రమాలకు పాల్పడుతున్నారు. దీంతో అమాయక జనం వీరిలాంటి మాటలు విని నిట్టనిలువునా మునిగిపోతున్నారు. మాయ మాటలు చెప్పి వ్యాపారం పేరుతో జనాన్ని మోసం చేసిన సంఘటన పెద్దకడబూరు మండలంలో వెలుగు చూసింది.

ఎమ్మిగనూరు డీఎస్పీ భార్గవి, కోసిగి సీఐ మంజునాథ్‌లు తెలిపిన వివరాల మేరకు పెద్దకడబూ రుకు చెందిన చింతకుంట నీలయ్య మొదటగా ట్రాక్టర్ నడుపుతూ జీవనం సాగించేవాడన్నారు. కాలక్రమేన జేసీబీలను కొనుగోలు చేసి విక్రయించేవాడు. అయితే కొన్ని రోజులకు జేసీబీల విక్రయ వ్యాపారంలో నష్టాలు వచ్చాయి. ఈ క్రమంలో ఆదోని పట్టణానికి చెందిన భార్గవ్ రాముడితో పరిచయం ఏర్పడింది. భార్గవ్ రాముడు జేసీబీలు విక్రయించే డీలర్స్ వాట్సప్ గ్రూపులో సభ్యుడిగా ఉన్నాడు. ఎవరైనా జేసీబీలకు విక్రయిస్తామని గ్రూపులో పోస్టు పెడితే ఈ సమాచారాన్ని చింతకుంట నీలయ్యకు సమాచారం తెలిపేవాడు. ఈ సమాచారంతో నీలయ్య కంటీన్యూ ఫైనాన్స్ కింద జేసీబీలు కొనుగోలు చేసి కంతుల రూపంలో నగదు కట్టే విధంగా కంపెనీతో మాట్లాడుకొని తాను కొన్ను జేసీబీకి రెండు లేదా మూడు నెలల వరకు కంతులు సక్రమంగా చెల్లించేవాడు. అటు తర్వాత మరొకరికి తక్కువ ధరకు విక్రయించి సొమ్ము చేసుకునేవాడు. అమ్మిన వారికి జేసీబీ బండి కంతులు అన్ని కట్టి ఫైన్స్ క్లియర్ చేసి వారి పేరుపై చేయిస్తానని చెప్పి జేసిబిని అప్పగించి వాచ్చేవాడు. ఈ క్రమంలో కొన్ని జేసీబీలను నీలయ్య, భార్గవ్‌రాముడులకు అందజేయడానికి కొటిపల్లి గ్రామానికి చెందిన అమల్తూర్ రాజు అలియాస్ బాపట్ల రాజు ఏజెంట్‌గా వ్యవహరించేవాడు. ఇలా తీసుకున్న కొన్ని జేసీబీలను బళ్లారికి చెందిన షఫిసాబ్‌హల్లి ఏజెంట్‌గా ఉండి అమ్మించేవాడు. ఇలా వచ్చిన నగదును అందరు పంచుకునేవారు. మిగిలిన డబ్బులతో వారు తీసుకున్న జేసీబీలకు కొన్ని కంతుల రూపంలో చెల్లించేవారన్నారు. ఈ క్రమంలో డోన్‌కు చెందిన లత వద్ద కంటీన్యూ ఫైనాన్స్ కింద తీసుకున్న బండిని పెద్దకడబూరు గ్రామానికి చెందిన జింకనాగరాజుతో కలిసి ఆదోనికి చెందిన గుమట మహబూబ్ బాషాలతో జేసీబీ ఛాసిస్ నెంబర్ మీద జింక నాగరాజు జేసీబీ ఛాస్ నెంబర్ ప్రింటు వేయించి లత బండిని కర్ణాటక రాష్ట్రం మాన్వి తాలుకా కుర్ది గ్రామానికి చెందిన మహమ్మద్ నెహల్ గౌస్‌కు విక్రయించారు. ఈ జేసీబీ యజమాని లత జీపీఎస్ ఆధారంగా తన జేసీబీ వాహనాన్ని ఎక్కుడుందో గుర్తించుకుంది. జేసీబీలు అమ్మడం, తాకట్టు పెట్టడం ద్వారా సుమారు రూ.63.10లక్షలు తీసుకున్నారు. ఈ క్రమంలో హిందూపురంకు చెందిన నిర్మలాబాయి జేసీబీని నీలయ్య, భార్గవ్‌రాముడు, జింక నాగరాజులు కొనుగోలు చేసి జేసీబీకి ఉన్న కంతులు కట్టకపోవడంతో కంపెనీ వారు నిర్మలాబాయిని జేసీబీ డబ్బులు చెల్లించాలని ఒత్తిడి చేశారు. దీంతో నిర్మలాబాయి తాను తన జేసీబీని నీలయ్య, భార్గవ్ రాముడు, జింక నాగరాలకు విక్రయించానని తన బండికి సంబంధించిన పూర్తి నగదును కట్టకుండ కాల యాపన చేస్తూ తనను ఇబ్బందులకు గురిచేస్తున్నారని సెప్టెంబర్ 14న పెద్దకడబూరు ఎస్ఐ నిరంజన్‌రెడ్డికి లికిత పూర్వకంగా ఫిర్యాదు చేసిందన్నారు. ఈ కేసును ఛాలెంజింగ్ గా తీసుకున్న ఎస్ఐ నిరంజన్‌రెడ్డి జేసీబీల క్రయ, విక్రయాల్లో ఉన్న మోసాన్ని గుట్టు రట్టు చేశారు. నీలయ్య, భార్గవ్‌రాముడు కొన్న 8 జేసీబీలను స్వాధీనం చేసుకోవడం జరిగిందన్నారు. స్వాదీనం చేసుకున్న 8 జేసీబీలను సంబంధిత యజమానులకు కోర్టు ద్వారా అప్పగించడం జరుగుతుందన్నారు. కేసు ఛేదించిన ఎస్ఐ నిరంజన్‌రెడ్డి, ఏఎస్ఐ ఆనంద్, శివరాములు, పోలీసు సిబ్బందిని డీఎస్పీ అభినందించారు.

హత్య కేసులో నిందితుల అరెస్టు

- నంద్యాల ఎస్పీ సునీల్ షెరాన్


నిందితులను చూపుతున్న ఎస్పీ

నంద్యాల టౌన్ డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): పట్టణానికి చెందిన పుల్లయ్య (65)ను నవంబరు నెల 14న హత్య చేసిన నిందితులను అరెస్టు చేసినట్లు ఎస్పీ సునీల్ షెరాన్ తెలిపారు. సోమవారం నిందితులను జిల్లా పోలీసు కార్యాలయంలో పాత్రికేయ సమావేశంలో చూపించారు. దేవనగర్‌కు చెందిన పుల్లయ్యను వైఎస్ నగర్‌కు చెందిన ధనుంజయ, పెసరవాయికి చెందిన గంగాధర రాఘవ, కాటిపోగు సంతోష్, బిలకలగూడూరుకు చెందిన బెస్త శ్రీకాంత్‌లను అరెస్టు చేసినట్లు తెలిపారు. భార్యతో విడాకులు తీసుకున్న పుల్లయ్య వీసీ కాలనీలో ఒంటరిగా ఉన్నాడని, తండ్రి ఫోన్ గత నెల 15 వ తేది నుంచి పని చేయక పోవడంతో బెంగళూరు నుంచి నంద్యాల వచ్చిన కుమారుడు ఆదిత్య ప్రసాద్ త్రీ టౌన్ పోలీసులకు ఫిర్యాదు చేశాడని తెలిపారు. ఇల్లు అమ్మి కొనే ప్రయత్నంలో ఉన్న పుల్లయ్య వద్ద డబ్బులు ఉన్నాయని, ఒంటరిగా ఉన్నాడని గమనించి ధనుంజయ గత నెల 14 న పని ఉందని బోలేరో వాహనంలో ఎక్కించుకుని గడివేముల దారికి తీసుకువెళ్లి రూ.25 లక్షలు డిమాండు చేశాడని తెలిపారు. డబ్బు ఇవ్వనని చెప్పడంతో పుల్లయ్యను ధనుంజయ, రాఘవ హ త్యచేసి, మద్దూరు వద్ద కుందూ నదిలో పడేసినట్లు తెలిపారు. అనంతరం నంద్యాల వచ్చి మృతుడి ఇంటికి వెళ్లి ల్యాప్‌ట్యాప్, డీవీఆర్, డాక్యుమెంట్లు తీసుకొని పోయారని తెలిపారు. త్రీటౌన్ సీఐ కంబగిరి రాముడు విచారణలో కాల్ డేటా, సీసీ కెమెరాల ఆధారంతో నలుగురు నిందితు లను అరెస్టు చేసినట్లు తెలిపారు. వారి నుంచి కత్తి, రెండు డీవీఆర్‌లు, ల్యాప్ ట్యాప్, విలువైన డ్యాకుమెంట్లు స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. కేసును ఛేదించినందుకు పోలీసులను ఎస్పీ అభినందించారు. ఈ కార్యక్రమంలో ఏఎస్పీ మందా జావళి, త్రీటౌన్ పోలీసులు పాల్గొన్నారు.

ఉత్తరాంధ్ర, సీమ, అమరావతి ఖర్చుపై శ్వేతపత్రం విడుదల చేయాలి

- రాయలసీమ రాష్ట్ర సమితి జాతీయ అధ్యక్షుడు కుంచం వెంకటసుబ్బారెడ్డి



కర్నూలు న్యూసిటీ, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): ఉత్తరాంధ్ర, రాయలసీమ, అమరావతి ప్రాంతాల అభివృద్ధికి ఎంత ఖర్చు చేశారో రాష్ట్ర ప్రభుత్వం తక్షణమే శ్వేతపత్రం విడుదల చేయాలని రాయల సీమ రాష్ట్ర సమితి జాతీయ అధ్యక్షుడు డాక్టర్ కుంచం వెంకటసుబ్బారెడ్డి డిమాండ్ చేశారు. సోమవారం కర్నూలులో విలేక రులతో మాట్లాడారు. రాయలసీమ ప్రజల ఓట్లతో గెలిచిన ప్రజాప్రతినిధులు నేడు సీమకే అన్యాయం చేస్తున్నారని విమర్శించారు. ఏ ఒక్క ఎమ్మెల్యే కూడా రాయలసీమ గురించి, ఇక్కడి ప్రజల బాగోగుల గురించి అసెంబ్లీలో ప్రస్తావిం చారా? అని ప్రశ్నించారు. రాయలసీమకు ఎంత ఖర్చు పెట్టి అభివృద్ధి చేశారో ఒక శ్వేతప్రతాన్ని విడుదల చేయాలని డిమాండ్ చేశారు. సీమ ఉద్యమ జ్వాలలు ఎగసిపడక ముందే చల్లార్చడానికి ప్రయత్నం చేయాలని హితవు పలికారు. రూ.వేల కోట్ల పెట్టుబడులతో పరిశ్రమలు తీసుకొచ్చి సీమ ప్రాంత రూపురేఖలు మార్చాలన్నారు. పెట్టుబడులు, వనరులు అన్ని తీసుకెళ్లి కోస్తా అభివృద్ధికి పాటుపడు తున్నారని విమర్శించారు. ప్రజాప్రతినిధులు వ్యవహరిస్తున్న తీరును రాయలసీమ ప్రజలు గమనిస్తున్నారని, శ్వేతపత్రం విడుదల చేయకుంటే ప్రజాప్రతినిదుల భరతం పట్టే కాలం దగ్గరికి వచ్చిందని హెచ్చరించారు.

కర్నూలు

కర్నూలు ● కోడుమూరు ● పాణ్యం

జీపడబ్ల్యూఎస్ అధికారిగా వి. సుధీర్

ఓర్వకల్లు, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): మండల జీపడ



బ్ల్యూఎస్ అధికారిగా ఎంపీడీవో కార్యాలయ సీనియర్ అసిస్టెంట్ సుధీర్‌ను నియమించినట్లు ఎంపీడీవో అనసూయ సోమవారం తెలిపారు. డిప్యూటీ ఎంపీడీవోగా పదోన్నతి ఇచ్చి నియమించామన్నారు. సుధీర్ మాట్లాడుతూ ఎంపీడీవో పర్యవేక్షణలో సమన్వయంతో పనిచేసి సచివాలయ వ్యవస్థను బలోపేతం చేస్తానన్నారు.

రూ.26వేల వేతనం ఇవ్వాలి



కలెక్టరేట్ వద్ద ధర్నాలో చేస్తున్న రిసోర్స్ పర్సన్లు

కర్నూలు న్యూసిటీ, డిసెంబరు 1(ఆంధ్రజ్యోతి): మెప్మా ఆర్పీలకు కనీస వేతనం రూ.26 వేలు ఇవ్వాలని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు పీఎస్. రాధాక్రిష్ణ డిమాండ్ చేశారు. మెప్మా ఆర్పీ ఉద్యో గుల సంఘం జిల్లా కమిటీ అధ్వర్యంలో సోమవారం కలెక్టరేట్ వద్ద సంఘం జిల్లా అధ్యక్షురాలు రుద్రమ్మ అధ్యక్షతన ధర్నా నిర్వహించారు. పెండింగ్ జీతాలు తక్షణమే విడుదల చేయాలని, మహిళా మార్ట్ కోసం గ్రూపు సభ్యులు చెల్లించిన రూ.66 లక్షలను సభ్యులకు తిరిగి చెల్లించాలని డిమాండ్ చేశారు. పొదుపు గ్రూపు సభ్యులు, ఆర్పీలపై రాజకీయ నాయకుల జోక్యం నివారించాల న్నారు. ఎస్. ఉమాదేవి, పి.నిర్మల, జి.రామక్రిష్ణ, ఆర్.నరసింహులు తదితరులు పాల్గొన్నారు.

సత్వర పరిష్కారం చూపాలి



కమిషనర్‌కు వినతి పత్రం అందజేస్తున్న నగర ప్రజలు

● కమిషనర్ పి.విశ్వనాథ్

కర్నూలు న్యూసిటీ, డిసెంబరు 1(ఆంధ్రజ్యోతి): ప్రజా ఫిర్యాదుల పరిష్కర వేదికకు ప్రతి ఫిర్యాదుకు సత్వర పరిష్కారం చూపాలని నగర పాలక కమిషనర్ పి.విశ్వనాథ్ ఆదేశించారు. సోమవారం స్థానిక ఎస్‌బీఐ కాలనీలోని నగర పాలక సమావేశ భవనంలో నిర్వహించిన పీజీఆర్ఎస్ కార్యక్రమానికి 23 అర్జీలు వచ్చాయి. అర్జీదారులను పదేపదే తిప్పకోకుండా స్వయంగా పరిశీలించి పరిష్కరించాలన్నారు డిప్యూటీ కమిషనర్ సతీష్‌కుమార్ రెడ్డి, మేనేజర్ చిన్నరాముడు, కార్యదర్శి నాగరాజు, ఇన్‌చార్జి ఎస్ఈ శేషసాయి, ఇంచార్జి సీపీ వెంకటరమణ, ఎంఈ మనోహర్‌రెడ్డి, మెడికల్ హెల్త్ ఆఫీసర్ డా.వై. నాగప్రసాద్‌బాబు, ఆర్ఓ జునైద్, టిడ్కో అధికారి పెంచలయ్య తదితరులు పాల్గొన్నారు.

ప్రసూతి విభాగంలో ప్రత్యేక ల్యాబ్

● అక్కడే పరీక్షలు, రిపోర్టులు : సూపరింటెండెంట్



మెడికల్ వార్డులను తనిఖీ చేస్తున్న సూపరింటెండెంట్

కర్నూలు హాస్పిటల్, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): మాతా శిశుసంరక్షణ కేంద్రంలోనే గర్భిణులు, పిల్లల కోసం ప్రత్యేక ల్యాబ్ ఏర్పాటు చేస్తున్నట్లు జీజీహెచ్ సూపరింటెండెంట్ డా.కే. వెంకటేశ్వర్లు తెలిపారు. సోమవారం సర్వజన వైద్యశాల విభాగాలను తనిఖీ చేశారు. నర్సింగ్ విభాగంలో ప్రతి నెల డ్యూటీ రోస్టర్‌ను రొటేషన్ పద్ధతిలో అమలు చేయాలని నర్సింగ్ సూపరింటెండెంట్‌ను ఆదేశించారు. ఎంసీహెచ్, పీడియాట్రిక్ విభాగాల్లో రక్త నమూనాలను అక్కడే సేకరించి రిపోర్టులు కూడా అదే విభాగం ద్వారా అందిస్తామన్నారు.

ఉచిత పరికరాల నిర్ధారణ శిబిరం



పరీక్షలు నిర్వహిస్తున్న నిర్వాహకులు

కర్నూలు ఎడ్యుకేషన్, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): నగరంలోని బి.క్యాంపు ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాలలో సోమవారం ప్రత్యేక అవసరాలు గల పిల్లలకు ఉచిత పరికరాల నిర్ధారణ పరీక్షల శిబిరం నిర్వహించారు. సమగ్ర శిక్ష అడిషినల్ ప్రాజెక్టు కోఆర్డినేటర్ డా. ఎస్‌బీ లోకరాజ్ మాట్లాడుతూ ఈ శిబిరం ఏడు రోజుల పాటు ఏడు అసెంబ్లీ నియోజకవర్గాల్లో నిర్వహిస్తారన్నారు. పరీక్షల అనంతరం పిల్లల అవసరాల ప్రకారం వారికి పరికరాలు పంపిణీ చేస్తామన్నారు. మొత్తం 140 మంది పిల్లలు హాజరయ్యారు. ఐఈఆర్‌పీ సురేంద్రబాపూజీ పాల్గొన్నారు.

విలీన గ్రామాల్లో పనులు కల్పించాలి

కల్లూరు, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): కర్నూలు కార్పొరేషన్లో విలీనమైన గ్రామాల్లో ఉపాధి పనులు కల్పించాలని వ్యవసాయ కార్మిక సంఘం ప్రధాన కార్యదర్శి కెవి. నారాయణ డిమాండ్ చేశారు. సోమవారం మండల పరిషత్ కార్యాలయం వద్ద ధర్నా చేశారు. గ్రామాల్లో వ్యవసాయ పనులు తగ్గుముఖం పట్టాయని, పనుల కోసం కూలీలు వలసలు పోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. అలాగే పెద్దపాడు, పందిపాడు లక్ష్మీపురం గ్రామాల్లో 5 నెలల వేతనాలు పెండింగ్ ఉన్నాయన్నారు. అనంతరం ఎంపీడీవోకు వినతిపత్రం అందజేవారు



వినతి పత్రం ఇస్తున్న నాయకులు

పదో తరగతి మెటీరియల్ పంపిణీ



మెటీరియల్‌ను అందజేస్తున్న కలెక్టర్ డా. సిరి

కర్నూలు కలెక్టరేట్, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): గిరిజన సంక్షేమ గురుకుల పాఠశాల పదో తరగతి విద్యార్థులకు కలెక్టర్ డా. సిరి స్టడీ మెటీరియల్‌ను పంపిణీ చేశారు. సోమవారం సునయన ఆడిటోరియంలో కలెక్టర్ మాట్లాడుతూ పదో తరగతి పరీక్షల్లో మంచి ఉత్తీర్ణత సాధించాలని విద్యార్థులకు సూచించారు. కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ నూరుల్ కమర్, గిరిజన సంక్షేమ అధికారి సురేష్ పాల్గొన్నారు.

వినతుల స్వీకరణ

కలెక్టర్ డా.సిరి ప్రజా పరిష్కార వేదికలో ప్రజల నుంచి వినతులు స్వీకరించారు.

● ఓర్వకల్లు మండలం గుట్టపాడు గ్రామంలో ఎల్‌పీ నెంబర్.347, 484, 498లలో మూడు ఎకరాల పొలంలో కొంత భాగాన్ని ఆక్రమించుకున్నారనీ రైతు దేవన్న కలెక్టర్‌కు పిర్యాదు చేశారు. ఆక్రమించుకున్న వారిపై చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు.

● రుద్రవరం గ్రామంలో మాజీ సైనికులకు కేటాయించిన భూమి భూకబ్జాలకు గురి కాకుండా రక్షణ కల్పించాలని మాజీ సైనికులు జిల్లా కలెక్టర్ విజ్ఞప్తి చేశారు.

అధిక పింఛన్ ఇస్తున్న చంద్రబాబు

● కోడుమూరు ఎమ్మెల్యే దస్తగిరి



పింఛన్ అందజేస్తున్న ఎమ్మెల్యే దస్తగిరి



కర్నూలులో పింఛన్ ఇస్తున్న కుడా చైర్మన్ సోమిశెట్టి

కోడుమూరు రూరల్, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): దేశంలోకెల్లా రాష్ట్రంలో సీఎం చంద్రబాబు అధిక పింఛన్లను ఇస్తున్నారని ఎమ్మెల్యే బొగ్గుల దస్తగిరి అన్నారు. సోమవారం ప్యాలకుర్తి గ్రామంలో నూతనంగా మంజూరైన పింఛన్లను పంపిణీ చేశారు. ముందుగా ఆటో సెంటర్ వద్ద అంబేద్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. తల్లికి వందనం, ఉచిత బస్సు ప్రయాణం, అన్నదాత సుఖీభవ, ఉచిత గ్యాస్, పించన్ పెంపు, మెగా డీఎస్సీ అన్నా క్యాంటీన్ పథకాలు అమలు చేసి పేదల కళ్లలో వెలుగులు నింపామన్నారు.

నిలిచిపోయేలా పింఛన్ల పంపిణీ చరిత్రలో

కర్నూలు అర్బన్: టీడీపీ ప్రభుత్వం ఇస్తున్న పింఛన్ల పంపిణీ చరిత్రలో నిలిచిపోతుందని కుడా చైర్మన్, టీడీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సోమిశెట్టి వెంకటేశ్వర్లు అన్నారు. సోమవారం నగరంలోని 14, 25 వార్డుల్లో పింఛన్లను అందజేశారు. తెలుగు యువత జిల్లా అధ్యక్షుడు అబ్బాస్, సోమిశెట్టి వెంకటేశ్వర్లు, నగర అధ్యక్షుడు నాగరాజు యాదవ్, సివిల్ సప్లయ్ రాష్ట్ర డైరెక్టర్ కొంకతి లక్ష్మి నారాయణ, కార్పొరేటర్లు జకియా అక్సారీ, రాజశేఖర్ యాదవ్, తదితరులు పాల్గొన్నారు.

98 శాతం పింఛన్ల పంపిణీ

సి.బెళగల్: మండలంలోని 18 గ్రామ పంచాయతీల్లో 98 పింఛన్లను పంపిణీ చేసినట్లు ఎంపీడీవో రాణెమ్మ తెలిపారు. సచివాలయ సిబ్బంది ఉదయం 7 గంటల నుంచే లబ్ధిదారుల ఇంటి వద్దకు వెళ్లి పంపిణీ చేశారని వలస వెళ్లిన వారు పంచాయతీ కార్యాలయానికి వచ్చి పింఛన్లను తీసుకోవాలని తెలిపారు. డిప్యూటి ఎంపీడీవో మహేశ్వరి, సూపరింటెండెంట్ శ్రీనివాసులు, పంచాయతీ కార్యదర్శులు, సచివాలయ సిబ్బంది ఉన్నారు.

గూడూరు: కె..నాగులాపురం గ్రామంలో మండల టీడీపీ అధ్యక్షుడు జే.సురేష్ పింఛన్లు పంపిణీ చేశారు. గోపాల్ రెడ్డి, తిరుపాలు, సుంకన్న, నాగులు, యుగంధర్, పాల్గొన్నారు.

హెచ్ఐవీ బాధితుల పట్ల వివక్ష వద్దు

● కలెక్టర్ డాక్టర్ ఏ. సిరి



ర్యాలీని ప్రారంభిస్తున్న కలెక్టర్ డా.సిరి

కర్నూలు హాస్పిటల్, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): హెచ్ఐవీ బాధితుల పట్ల వివక్ష చూపకూడదని, బాధితులు అధైర్యపడవద్దని కలెక్టర్ డాక్టర్ ఏ.సిరి పేర్కొన్నారు. సోమవారం జిల్లా వైద్య ఆరోగ్య శాఖ, జిల్లా ఎయిడ్స్ నివారణ విభాగం ఆధ్వర్యంలో ఉదయం ప్రపంచ ఎయిడ్స్ డే సందర్భంగా ర్యాలీని జేసీ నూరుల్ కమర్‌తో కలిసి ప్రారంభించారు. జిల్లాలో 7 మంది బాధితులు ఉన్నారన్నారు. మందులు వాడితే సాధారణ జీవితం గడపవ చ్చునన్నారు. హెచ్ఐవీని ప్రారంభదశలోనే గుర్తిస్తే చికిత్స తీసుకోవచ్చన్నారు. డీఎంహెచ్‌వో డా.ఎల్.భాస్కర్, డీసీహెచ్ఎస్ డా.జఫ్రుల్లా, అలిహైదర్ పాల్గొన్నారు.

హరికిషన్‌కు 'కళామిత్ర' పురస్కారం

కర్నూలు కల్చరల్, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): బాలసాహితీవేత్త, రచయిత డాక్టర్ హరికిషన్ 'కళామిత్ర' పురస్కారం అందుకున్నారు. ఆదివారం ఒంగోలులోని ఎన్‌టీఆర్ కళాక్షేత్రంలో, దివంగత మండలి వెంకట కృష్ణారావు శత జయంతి సందర్భంగా ఆయనకు అందజేశారు. అవనిగడ్డ ఎమ్మెల్యే మండలి బుద్ధ ప్రసాద్, సీబీఐ మాజీ జేడీ లక్ష్మీనారాయణ, మండలి అధ్యక్షుడు నూనె అంకమరావు జ్ఞాపిక, ప్రశంసాపత్రం అందజేశారు.



పురస్కారం అందుకుంటున్న హరికిషన్

పింఛన్లతో పేదలకు భరోసా



హుశేనాపురంలో పింఛన్లు పంపిణీ చేస్తున్న నంద్యాల జిల్లా టీడీపీ అధ్యక్షుడు మల్లెల రాజశేఖర్

ఓర్వకల్లు, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): ఎన్టీఆర్ భరోసా పింఛన్లు పేదలకు వరమని నంద్యాల జిల్లా అధ్యక్షుడు టీడీపీ మల్లెల రాజశేఖర్ అన్నారు. సోమవారం మండలంలోని హుశేనాపురంలో నాయకులు చంద్రపెద్దస్వామి, మహబూబ్‌బాషాతో కలిసి పింఛన్లను పంపిణీ చేశారు. గుట్టపాడు గ్రామంలో సర్పంచ్ నర్ల మోహన్ రెడ్డి, ఓర్వకల్లులో గోవిందరెడ్డి, లక్ష్మికాంతరెడ్డి, చింతలపల్లెంలో సర్పంచ్ వెంకటరమణ, పాలకొలనులో సర్పంచ్ సుజాతమ్మ, నన్నూరులో విశ్వేశ్వరరెడ్డి పంపిణీ చేశారు.

యువత కృషితోనే ఎయిడ్స్ రహిత సమాజం



ర్యాలీ ప్రారంభిస్తున్న వీసీ

కర్నూలు అర్బన్, డిసెంబరు 1(ఆంధ్రజ్యోతి): యువత కృషితోనే ఎయిడ్స్ రహిత సమాజ నిర్మాణం సాధమని వీసీ వెంకట బసవరావు అన్నారు. సోమవారం ఆర్‌యూలో ఎన్ఎస్ఎస్ విభాగం ఆధ్వర్యంలో ఎయిడ్స్ దినోత్సవ ర్యాలీని ప్రారంభించారు. వైద్యం, మందులతో రోగి జీవిత కాలాన్ని పెంచగలము గాని నివారణ సాధ్యం కాదన్నారు. రెక్టార్ ఎన్‌టీకే నాయక్, రిజిస్ట్రార్ విజయకుమార్, ప్రిన్సిపల్స్ విశ్వనాథరెడ్డి, పీవీ సుందరానందపుచ్చా, ఎన్‌సీసీ సమన్వయకర్త పి. నాగరాజు, బి.విజయుడు, నాగచంద్రుడు, శివప్రసాదరెడ్డి, వివిధ విభాగాల ఆధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

గంజాయి ముఠాను శిక్షించాలి

కర్నూలు న్యూసిటీ, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): నెల్లూరు జిల్లాలో సీపీఎం నాయకుడు, కళాకారుడు పెంచలయ్యను హత్యచేసిన గంజాయి ముఠాను శిక్షించాలని ప్రజా సంఘాల ఐక్యవేదిక నాయకులు డిమాండ్ చేశారు. సోమవారం కలెక్టరేట్ వద్ద కొవ్వొత్తులతో నిరసన తెలిపారు. జనవిజ్ఞాన వేదిక జిల్లా అధ్యక్షుడు సుధీర్, సాహితి స్రవంతి నాయకులు రఘుబాబు, వ్యవసాయ సంఘం జిల్లా కార్యదర్శి నారాయణ మాట్లాడుతూ నెల్లూరులోని అసాంఘిక శక్తులకు వ్యతిరేకంగా గంజాయి, డ్రగ్స్‌పై ప్రజలను చైతన్యం చసిన పెంచలయ్యను హత్యచేయడం దారుణమన్నారు. సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు పీఎస్..రాధాక్రిష్ణ జిల్లా కార్యదర్శి ఎండి. అంజిబాబు, డీవైఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు రాఘవేంద్ర, రంగప్ప, రామక్రిష్ణ, ఆనంద్‌బాబు తదితరులు పాల్గొన్నారు.

స్కిన్‌కేర్ సెంటర్లపై చర్యలు తీసుకోవాలి

కర్నూలు న్యూసిటీ, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): అనుమతి లేకుండ నిర్వహిస్తున్న స్కిన్ కేర్ సెంటర్లపై చర్యలు తీసుకోవాలని ఏఐవైఎఫ్ జిల్లా కార్యదర్శి శ్రీనివాసులు డిమాండ్ చేశారు. సోమవారం సీఆర్ భవన్‌లో మాట్లాడుతూ డీఎంహెచ్‌వో అనుమతి లేకుండానే ఏర్పాటు చేసుకుని, మహిళలతో అర్ధనగ్న ప్రకటనలు ఇస్తూ రూ.లక్షలు దండుకుంటున్నారని ఆరోపించారు. శ్రీరాములు, నాగరాజు, బీసన్న, దస్తగిరి పాల్గొన్నారు.

5న విద్యుత్ అదాలత్

కల్లూరు, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): ఈనెల 5న వెల్దుర్తి 33-11 విద్యుత్ సబ్‌స్టేషన్ ఆవరణలో వినియోగదారుల సమస్యల పరిష్కారానికి విద్యుత్ అదాలత్ నిర్వహిస్తున్నట్లు కర్నూలు డివిజన్ ఈఈ టి.శేషాద్రి ప్రకటనలో తెలిపారు. మధ్యాహ్నం 3 నుంచి 5 గంటల వరకు ఉంటుందని, విశ్రాంత న్యాయధికారి వి.శ్రీనివాస ఆంజనేయమూర్తి, సభ్యులు జి.మధు కుమార్, శ్రీనివాసబాబు, సభ్యురాలు విజయలక్ష్మి హాజరవుతారన్నారు.

సూపర్ సిక్స్.. సూపర్ సక్సెస్

● పాణ్యం ఎమ్మెల్యే గౌరు చరితారెడ్డి



21వ వార్డులో పింఛన్లు పంపిణీ చేస్తున్న గౌరు చరితారెడ్డి

కల్లూరు, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు సూపర్‌సిక్స్ హామీలను సూపర్ సక్సెస్ చేశామని పాణ్యం ఎమ్మెల్యే గౌరుచరితారెడ్డి అన్నారు. సోమవారం 21వ వార్డు మాధవీనగర్, శ్రీనగర్ కాలనీలో పింఛన్లు పంపిణీ చేశారు. టీడీపీ ప్రభుత్వం పింఛన్ల పెంపు, మోగా డీఎస్సీ ఉచితబస్సు ప్రయాణం, మహిళలకు మూడు ఉచిత సిలిండర్లు, తల్లికివందనం, అన్నదాత సుఖీభవ పథకాలు అందజేశామన్నారు. డైరెక్టర్ నాగముని, రాఘవేంద్రా, వెంకటరెడ్డి, జగదీశ్వరరెడ్డి, రఘునాథ్‌రెడ్డి, వసుంధర, భరత్, లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.

క్యాంపు కార్యాలయంలో పాణ్యం నియోజకవర్గానికి చెందిన ఇద్దరికి రూ. 57,595 రూపాయల సీఎం సహాయనిధి చెక్కులను అందజేశారు.

● కల్లూరు మండలంలో 95.94 శాతం పింఛన్లను పంపిణీ చేసినట్లు ఎంపీడీవో జి.నాగశేషాచలరెడ్డి తెలిపారు.

భక్తి శ్రద్ధలతో గీతా జయంతి



గీతా ప్రచార ధామంలో సామూహిక గీతా పఠనం



వాసవీనగర్‌లో గీతా జయంతి పూజలు

కర్నూలు కల్చరల్, డిసెంబరు 30 (ఆంధ్రజ్యోతి): నగరంలో గీతా జయంతిని భక్తులు సోమవారం నిర్వహించారు. బళ్లారి చౌరస్తా సమీపంలోని వాసవీ నగర్ వేంకటేశ్వర స్వామి ఆలయంలో శ్రీకృష్ణ చిత్ర పటానికి, భగవద్గీత గ్రంథాలకు పూలదండలు వేసి పూజలు చేశారు. ఆలయ కమిటీ సభ్యుడు ఎలిశెట్టి రమేష్‌బాబు, వీహెచ్‌పీ జిల్లా సత్సంగ్ సహ ప్రముఖ్, మాతృశక్తి ప్రతినిధి హేమలత, ఆలయ ప్రధాన అర్చకుడు రామానుజమూర్తి తదితరులు పాల్గొన్నారు. సంకల్ బాగ్‌లో గీతా ప్రచార ధామంలో శ్రీకృష్ణ విగ్రహానికి, భగవద్గీత పుస్తకాలకు పూలదండలు, తులసి దండలతో పూజలు చేశారు. ప్రవచన కర్త శివశంకర్ గీతను వివరించారు. డీవీ రమణ, ఇల్లూరు రమణ, సింహాద్రి రమేష్, మహాబలేష్ సజ్జనర్ పాల్గొన్నారు. అనంతరం భక్తులకు తీర్థ ప్రసాదాలు పంపిణీ చేశారు.

గ్రామాల్లో వలసలు ఆపండి

● డ్వామా పీడీకి వినతి



వినతి పత్రం ఇస్తున్న నాయకులు

కర్నూలు అగ్రికల్చర్, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో ఉపాధి పనులు కల్పించి వలసలను నివారించాలని ఏపీ వ్యవసాయ కార్మిక సంఘం ప్రతినిధులు డిమాండ్ చేశారు. ఈ మేరకు సోమవారం జిల్లా నీటి యాజమాన్య సంస్థ ప్రాజెక్టు డైరెక్టర్ (పీడీ) వెంకటరమణయ్యకు వినతి పత్రం అందజేశారు. జిల్లా ప్రధాన కార్యదర్శి కేవీ నారాయణ విలేకరులతో మాట్లాడుతూ జిల్లాలో పనులు లేక గ్రామీణ పేదలు సుదూర ప్రాంతాలకు వలస వెళ్తున్నా రన్నారు. వలసల నివారణ కోసం జాతీయ గ్రామీణ ఉపాధి హామీ చట్టం అమలు చేసినా ప్రయోజనం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఉపాధి హామీ చట్టంలో రాజకీయ జోక్యం పెరిగిందని, క్షేత్ర స్థాయి సిబ్బందిపై వేదింపులు ఎక్కువయ్యా యన్నారు. తద్వారా పనులు క్షేత్ర స్థాయి సిబ్బంది సరిగ్గా కూలీలకు పనులు కల్పించలేకపోతున్నారని పీడీ దృష్టికి తెచ్చారు. మూడు నెలలుగా ఉన్న బకాయిలను వెంటనే చెల్లించాలని డిమాండ్ చేశారు. జిల్లా సహాయ కార్యదర్శి నాగన్న, మధు, తదితరులు పాల్గొన్నారు.

8న జాబ్ మేళా



పోస్టర్‌ను విడుదల చేస్తున్న కలెక్టర్, జేసీ

కర్నూలు కలెక్టరేట్, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): కేవీఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో డిసెంబరు 8న మెగా జాబ్‌మేళా నిర్వహిస్తున్నట్లు కలెక్టర్ డాక్టర్ సిరి అన్నారు. సోమవారం కలెక్టరేట్ సునయన ఆడిటోరియంలో నైపుణ్యం అభివద్ధి, శిక్షణ శాఖ ఆధ్వర్యంలో పోస్టర్లను జేసీ నూరుల్ కమర్‌తో కలిసి ఆవిష్కరించారు. జాబ్ మేళాలో 19 ప్రైవేటు కంపెనీల్లో 1,350 ఖాళీలను భర్తీ చేస్తారన్నారు. 18 నుంచి 35 సంవత్సరాలలోపు పదో తరగతి, ఇంటర్ డిగ్రీ, ఐటీఐ డిప్లమా బి.టెక్ పీజీ పూర్తిచేసిన వారు పాల్గొలన్నారు. ఉదయం 9.30 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు జాబ్ మేళా ఉంటుందన్నారు. .ఏపీ.జీవోవీ.ఇన్ వెబ్‌లింక్‌లో వివరాలు నమోదు చేసి చేసుకోవాలని, సందేహాలు ఉంటే 8374231357, 6300009183 నెంబర్లలో సంప్రదించాలన్నారు. ఉపాధి కల్పన అధికారి దీప్తి, నైపుణ్య అభివృద్ధి శిక్షణా అధికారి ఆనంద్, రాజ్ కుమార్ పాల్గొన్నారు.

రచయిత్రికి సన్మానం

కర్నూలు కల్చరల్, డిసెంబరు 30 (ఆంధ్రజ్యోతి): కర్నూలుకు చెందిన రచయిత్రి, చిత్రలేఖకురాలు, విశ్రాంత ఉపాధ్యాయురాలు పరవస్తు లక్ష్మీ సుశీలారాణిని అనంతపురం రాయలసీమ సాంస్కృతిక వేదిక నిర్వాహకులు సన్మానించారు. డల్లాస్ ఏరియా రాయలసీమ అసోసియేషన్ సౌజన్యంతో 180 మంది కవులు, కవయిత్రులు రాయలసీమ ప్రసిద్ధ క్షేత్రాలపై కవితాగానం చేశారు. సమన్వయకర్త డాక్టర్ అప్పిరెడ్డి హరినాథరెడ్డి, ఎస్కేయూ మాజీ వీసీ ఆచార్య రామకృష్ణారెడ్డి, ప్రొఫెసర్ గోవిందరెడ్డి లక్ష్మీ సుశీలారాణిని సన్మానించారు.



సన్మానం అందుకుంటున్న లక్ష్మీ సుశీలారాణి

ఇల్లు దగ్ధం

ఓర్వకల్లు, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): మండలంలోని నన్నూరు గ్రామానికి చెందిన టీడీపీ కార్యకర్త చాంద్‌బాషా ఇంట్లో ఇల్లు సోమవారం తెల్లవారుజామున విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో దగ్ధమైంది. బాధితుడి కథనం మేరకు.. రూ.1.45 లక్షలు, ఇంట్లో ఉన్న ఫ్రిజ్, కూలర్, వాషింగ్ మిషన్, దుస్తులు, నిత్యావసరాలు, బియ్యం కాలిపోయాయి. విషయం తెలుసుకున్న తహసీల్దార్ విద్యాసాగర్ పరిశీలించి, ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి నష్టపరిహారం ఇప్పిస్తామని హామీ ఇచ్చారు. తలారి విజయుడు, షంషుద్దీన్, హుశేన్ సర్కార్, కటిక హుసన్, సర్దార్ బేగ్, మాబు తదితరులు పాల్గొన్నారు.

అలరించిన 'హిందీ' సంగీత విభావరి

కర్నూలు కల్చరల్, డిసెంబరు 30 (ఆంధ్రజ్యోతి): కర్నూలు కళాకార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో టీజీవీ కళాక్షేత్రంలో ఆదివారం రాత్రి నిర్వహించిన హిందీ పాటల సంగీత విభావరి ప్రేక్షకులను అలరించింది. 'జానే కహా గయే వో దిన్' పేరుతో నాటి హిందీ గాయకులు ముఖేష్, రఫీ, కిషోర్‌కుమార్, మన్నాడే, లత, ఆశాభోంస్లే తదితర గాయకుల పాటలను పాడారు. నసీర్ ముఖేష్ ఆర్గనైజర్‌గా వ్యవహరించిన ఈ కార్యక్రమంలో గాయకులు సిరాజ్, నందిత జ్యోతి, ఎస్ ఖలీల్‌బాషా, అమీర్, అర్షద్, మాలిక్, హైదరాబాద్ బాబర్‌లు పాత హిందీ పాటలతో మైమరపించారు. కళాక్షేత్రం అధ్యక్షుడు, కళారత్న పత్తి ఓబులయ్య, కేజీ గంగాధర్‌రెడ్డి, కార్పొరేటర్ లతీఫ్ పాల్గొన్నారు.



పాటలు పాడుతున్న గాయకులు

పేదల అభివృద్ధే ప్రభుత్వ ధ్యేయం : కేఈ



పింఛన్ అందిస్తున్న పత్తికొండ ఎమ్మెల్యే కేఈ శ్యాంబాబు

తుగ్గలి, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): పేదవారిని ఆర్థికంగా అభివృద్ధి చేసి వారు ఎలాంటి ఇబ్బందులు పడకుండా చూడడమే కూటమి ప్రభుత్వ ధ్యేయమని పత్తికొండ ఎమ్మెల్యే కేఈ శ్యాంబాబు అన్నారు. సోమవారం మండల పరిధిలోని ఎద్దులదొడ్డిలో ఎన్టీఆర్ భరోసా సామాజిక భద్రతా పింఛన్లను పంపిణీ చేశారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు పేద ప్రజల కోసం సంక్షేమ పథకాలు అందించడంతో పాటు గ్రామాల్లో వారు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా పలు అభివృద్ధి పనులు చేపడుతున్నారన్నారు. సింగిల్ విండో అధ్యక్షుడు ప్రభాకర్ రెడ్డి, నాయకులు బత్తిన వెంకట్రాముడు, ఎద్దులదొడ్డి శ్రీనివాసులు గౌడు, సర్పంచ్ విజయ్, తిరుపాల్ నాయుడు, మిద్దె వెంకటేశ్ యాదవ్ పాల్గొన్నారు.

దేవనకొండ: వృద్ధుల, వితంతు, వికలాంగుల పేదల పాలిట ఆశాజ్యోతి సీఎం చంద్రబాబునాయుడని ఆలూరు టీడీపీ వైకుంఠం జ్యోతి, వాల్మీకి చైర్మన్ బొజ్జమ్మ అన్నారు. ఎంపీడీవో జ్యోతి, టీడీపీ మండల కన్వీనర్ విజయ్, రామారావునాయుడు, వన్నూరప్ప, తదితరులు పాల్గొన్నారు.

ఆదోని: ఆదోని మండలం సాదాపురం పంచాయతీలో సోమవారం తెల్లవారుజాము నుంచే ఎన్టీఆర్ భరోసా పింఛన్ల పంపిణీ కార్యక్రమం ఘనంగా జరిగింది. టీడీపీ నాయకుడు ఉమాపతినాయుడు ఆధ్వర్యంలో ఈ కార్యక్రమాన్ని చేపట్టారు. గ్రామ లీడర్లు, సచివాలయ అధికారులతో కలిసి ఉమాపతినాయుడు, టీడీపీ మండల అధ్యక్షుడు శివప్పలతో కలిసి పింఛన్ల పంపిణీ చేశారు. రంగస్వామినాయుడు, రంగస్వామి, కృష్ణారెడ్డి, రాజశేఖర్, మనోహర్ పాల్గొన్నారు.

● పేదవారి కష్టాలను తీర్చడం, ప్రతి ఇంటికి సంక్షేమ ఫలాలు అందించడం, పింఛన్ల పంపిణీ అనేది కేవలం ఆర్థిక సాయం మాత్రమే కాదు, వృద్ధులకు, నిస్సహాయులకు మనం ఇస్తున్న గౌరవం అని టీడీపీ సీనియర్ నాయకురాలు గుడిసె కృష్ణమ్మ పేర్కొన్నారు. మురళి, బూత్ కన్వీనర్‌లు బాబురావు, సాదిక్‌వలి, నాగేంద్ర పాల్గొన్నారు.

మద్దికెర: మండలంలోని ఆయా గ్రామాల్లో రాష్ట్ర ప్రభుత్వం అందిస్తున్న ఎన్టీఆర్ భరోసా పింఛన్లు లబ్ధిదారులకు సకాలంలో అందిస్తామని ఎంపీడీవో కొండయ్య అన్నారు. సోమవారం మండల పరిధిలోని ఎం.అగ్రహారం, పెరవలి, మద్దికెర గ్రామాల్లో పింఛన్లు పంపిణీ చేశారు. రమేష్, ఎర్రిస్వామి, ఆనంద్, మెడికల్ శ్రీను, రామాంజులు పాల్గొన్నారు.

ప్రజలకు సేవలు అందించడమే లక్ష్యం

తుగ్గలి, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో ఉన్న సచివాలయాల ద్వారా ప్రజలకు సేవలు అందించడమే లక్ష్యమని డిప్యూటీ ఎంపీడీవో మారుతి ప్రసాద్ అన్నారు. సోమవారం మండల కేంద్రమైన డీపీవో కార్యాలయంలో సీనియర్ అసిస్టెంట్‌గా పని చేస్తున్న మారుతి ప్రసాద్ ప్రమోషన్‌పై తుగ్గలి డిప్యూటీ ఎంపీడీవోగా బాధ్యతలు తీసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పంచాయతీ కార్యదర్శులు, సచివాలయ సిబ్బంది వారికి కేటాయించిన విధులను సక్రమంగా నిర్వర్తించాలని, అప్పుడే గ్రామాలు అభివృద్ధి చెందుతాయన్నారు. విధుల్లో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవన్నారు.

15 రోజులుగా నీరు వదలడం లేదు

మద్దికెర, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): మద్దికెర మేజర్ గ్రామ పంచాయతీకి మజరా గ్రామమైన బొజ్జనాయునిపేట గ్రామంలో గత పదిహేను రోజుల నుంచి పంచాయతీ వారు కొళాయిలకు నీరు వదలకపోవడంతో నీటి కష్టాలు తప్పడం లేదని టీడీపీ నాయకులు శాంతిరెడ్డి, రవి అన్నారు. సోమవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో నిర్వహించే ప్రజా సమస్యల పరిష్కార వేదికలో ఎంపీడీవో కొండయ్యకు వినతి పత్రం అందజేశారు. గ్రామానికి నీరు సరఫరా చేస్తే నీటి పథకాలకు సంబంధించిన మోటార్లు కాలిపోయి 15 రోజులైనా బాగు చేసే వారు లేకపోవడంతో వ్యవసాయ తోటలకు వెళ్లాల్సి వస్తుందన్నారు. విషయంపై ఎంపీడీవో కొండయ్య మాట్లాడుతూ సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లి నీరందించేలా చర్యలు తీసుకుంటామని తెలిపారు.

క్రిష్ణగిరి పీఏసీఎస్ సీఈఓ సస్పెన్షన్

క్రిష్ణగిరి, డిసెంబరు 1(ఆంధ్రజ్యోతి): క్రిష్ణగిరి ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం సీఈఓ కె శివన్న ఆంధ్రప్రదేశ్ గ్రామీణ బ్యాంకు నందు బిజినెస్ కరస్పాండెంట్(బీసీ)గా మరియు వెలుగు డీఆర్డీఏ(ఐకేపీ) ఆగవేలి గ్రామ బుక్ కీపర్‌గా ఎన్‌పీఎమ్‌సీఏగా విధులు నిర్వహిస్తూ జీతభత్యాలు పొంది ఉన్నాడు. అతడు బహుళ ఉద్యోగాలు నిర్వహిస్తున్నందున సర్వీస్ రూల్స్ నిబంధనల మేరకు సీఈఓ విధుల నుంచి సస్పెండ్ చేస్తూ చైర్మన్ కేఈ శేషాద్రి ఉత్తర్వులు జారిచేశారు.

డ్రంకెన్ డ్రైవ్ కేసులో జరిమానా

వెల్దుర్తిటౌన్/వెల్దుర్తి, డిసెంబరు 1(ఆంధ్రజ్యోతి): మద్యం తాగి వాహనం నడిపిన కేసులో ఒక్కొక్కరికి రూ.10 వేల చొప్పున కోర్టు జరిమానా విధించింది. ఎస్ఐ నరేశ్ తెలిపిన వివరాలివీ. .జిల్లా ఎస్పీ విక్రాంత్ పాటిల్ ఆదేశాల మేరకు వెల్దుర్తి పోలీస్‌స్టేషన్ పరిధిలో ఇటీవల కాలంలో డ్రంకన్ డ్రైవ్ కార్యక్రమాలు నిర్వహించారు. సోమవారం డోన్ జ్యుడీషియల్ ఫస్ట్‌క్లాస్ మేజిస్ట్రేట్ ఎదుట నిందితులను హాజరు పరచగా జడ్జి అపర్ణ ఒక్కొక్కరికి రూ.10 వేల చొప్పున 8 మందికి రూ.80వేలు జరిమానా విధించారు.

కలెక్టర్‌ను ఆశ్రయించిన జయలక్ష్మి

ఆస్పరి, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): మండలకేంద్రమైన ఆస్పరికి చెందిన జయలక్ష్మి అనే మహిళ ప్రభుత్వ పథకాల అమలులో కీలకమైన గ్రామాఖ్య సంఘం వీఆర్‌ఏ రెండేళ్లకు పైగా వేతనం లేకుండా పని చేస్తూ చివరకు న్యాయం కోసం కలెక్టర్ కార్యాలయ గడప తొక్కిన ఘటన జిల్లావ్యాప్తంగా చర్చనీయాంశంగా మారింది. ఈ మేరకు సీపీఐ నాయకులతో కలిసి జిల్లా కలెక్టర్‌కు వినతి పత్రం అందించి సమస్యను విన్నవించారు.

రైతుల సంక్షేమమే చంద్రబాబు ధ్యేయం

ఆలూరు రూరల్, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): రైతుల సంక్షేమమే ధ్యేయంగా ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు నిరంతరం కృషి చేస్తున్నారని టీడీపీ జిల్లా ఆర్గనైజింగ్ కార్యదర్శి కటారుకొండ శ్రీనివాసులు, ఆలూరు సొసైటీ చైర్మన్ బేవిన కురువ ఈరన్న అన్నారు. సోమవారం మొలగవల్లి గ్రామంలో గోకుల షెడ్డు నిర్మాణం పనులకు భూమిపూజ చేశారు ఏపీఓ శ్రీనివాసులు, మాజీ సర్పంచ్ రంగస్వామి, డీలర్ వెంకటేశ్వర్లు, మాల నరసింహులు, ప్రసాద్ పాల్గొన్నారు.

ఆదోని జిల్లా సాధనే ప్రజల ఆకాంక్ష

● ఉధృతమైన ఆదోని జిల్లా సాధన ఆందోళన
● భారీ ర్యాలీకి తరలివచ్చిన పుర ప్రజలు

ఆదోని/ఆదోని అగ్రికల్చర్, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి) చారిత్రక వాణిజ్య కేంద్రమైన ఆదోనిని ప్రత్యేక జిల్లాగా ప్రకటించకపోవడం కేవలం ఒక పరిపాలన లోపం కాదు. ఇది ఈ ప్రాంత భావితరాల భవిష్యత్‌ను బలిచేస్తున్న నిర్ణయం అని విశ్లేషకులు, సామాజిక కార్యకర్తలు తీవ్ర ఆవేదన వ్యక్తం చేస్తున్నారు..



నిరాహారదీక్షలో కూర్చున్న జేఏసీ నాయకులు

ప్రస్తుత జిల్లా కేంద్రం కర్నూలుకు 100 కి.మీ. నుంచి 150 కి.మీ. దూరం ఉండడం వల్ల ప్రమాదాలు, అత్యవసర వైద్యసేవలు, అవసరమైన రోగులు మార్గమధ్యలోనే ప్రాణాలు కోల్పోతున్నారు. స్థానిక ప్రజాప్రతినిధులు సైతం ఈ అంశాన్ని ముఖ్యమంత్రి దృష్టికి బలంగా తీసుకెళ్లడంలో విఫలమయ్యారా అనే సందేహం ప్రజల్లో ఉంది. గత ప్రభుత్వ పొరపాట్లను సరిదిద్దే అవకాశం ఉన్నా దానిని సద్వినియోగం చేసుకోలేక పోతున్నారనే విమర్శలు వినిపిస్తున్నాయి.రాబోయే స్థానిక, సార్వత్రిక ఎన్నికల్లో ఆదోని జిల్లాకు అనుకూలంగా స్పందించని పార్టీలకు, నాయకులకు తమ ఓటు శక్తితో గట్టి గుణపాఠం చెప్పాలని ప్రజలు నిర్ణయించుకున్నట్లు విశ్లేషకులు అంటున్నారు

ఉద్యమాన్ని తీవ్రతరం చేసిన జేఏసీ

ఆదోని జిల్లా సాధన పశ్చిమ ప్రాంత ఐదు నియోజకవర్గాల ప్రజల ఆకాంక్ష అని ఆదోని జిల్లా సాధన జాయింట్ యాక్షన్ కమిటీ సభ్యులు



ర్యాలీకి భారీగా తరలివచ్చిన పుర ప్రజలు

లలితా జితేంద్ర, ఆదినారాయణ, నూర్ అహ్మద్, రఘురామయ్య, కోదండ, తిరుమలేష్ అన్నారు. సోమవారం ఎమ్మిగనూరు, మంత్రాలయం, పత్తికొండ, ఆలూరు నియోజకవర్గాలను కలిపి ఆదోని జిల్లాగా ప్రకటించాలని జేఏసీ ఆధ్వర్యంలో భారీ ర్యాలీ చేపట్టారు. మునిసిపల్ క్రీడా మైదానానికి ఆదోని సివిక్స్ సొసైటీ, అగ్రిఇన్పుట్ డీలర్స్ అసోసియేషన్, బంగారు దుకాణదారుల సంఘం, చాంబర్ ఆఫ్ కామర్స్, కుల సంఘాలు, ప్రజా సంఘాలు, విద్యార్థి యువజన సంఘాలు, పుర ప్రజలు భారీగా తరలివచ్చారు. అక్కడి నుంచి మునిసిపల్ మెయిన్ రోడ్ మీదుగా శ్రీనివాస భవన్, భీమా సర్కిల్ నుంచి సబ్ కలెక్టర్ కార్యాలయం వరకు జిల్లా ప్రకటించాలంటూ నినాదాలు చేస్తూ ర్యాలీ సాగింది. భీమాస్ కూడలిలో అరగంట పాటు మానవహారం చేపట్టారు. దీక్షా శిబిరానికి సంఘీభావం తెలిపారు. ట్రాఫిక్ జామ్ కావడంతో ఉద్రిక్తత నెలకొంది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గత అక్టోబర్ మాసంలో రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాటు చేసిన మంత్రివర్గ ఉప సంఘం కమిటీ జిల్లాలో అభిప్రాయ సేకరణ కోసం పర్యటించాల్సి ఉన్నా అర్థాంతరంగా జిల్లా పర్యటనను రద్దు చేసుకున్నారన్నారు. ఎన్నో ఏళ్లగా తాము ఆదోని జిల్లాగా ప్రకటించాలని ప్రభుత్వాలను డిమాండ్ చేస్తున్నా పట్టించుకోలేదని ఆవేదన వ్యక్తం చేశారు. జిల్లా సాధన కోసం ఆమరణ దీక్ష కైనా పూనుకుంటామని అమరావతికి వెళ్లి సీఎం దృష్టికి తీసుకెళ్తామన్నారు. అనంతరం సబ్ కలెక్టర్ కార్యాలయం వద్ద బైఠాయించి సబ్ కలెక్టర్‌కు వినతిపత్రం అందజేశారు. జాయింట్ యాక్షన్ కమిటీ సభ్యులు కృష్ణమూర్తి గౌడ్, అశోకనందరెడ్డి, ఎర్రిస్వామి, దస్తగిరి, వీరేష్, పుర ప్రముఖులు విట్టా రమేష్, చంద్రకాంత్ రెడ్డి, విట్టా సతీష్, రాయచోటి సుబ్బయ్య, సుజ్ఞానమ్మ, వెల్లాల మధుసూదన శర్మ, ఖలీద్, దీపక్ పాల్గొన్నారు.

మా గ్రామాలను కలిపితే ఊరుకోం....

ఆదోని రూరల్ :మా ఊపిరి ఆగిన పోరాటం మాత్రం ఆగదని గణేకల్, చాగి, నారాయణపురం, పెద్దతుంబళం, పాండవగల్లు, మదిరె, కడితోట గ్రామాల ప్రజలు ఆవేదన వ్యక్తం చేశారు. రాష్ట్ర ప్రభుత్వం అశాస్త్రీయంగా ఆదోని మండలాన్ని విభజించడాన్ని వ్యతిరేకిస్తూ, పెద్దహరివాణం మినహా, నూతనంగా పెద్దహరివాణం మండలంలో



సబ్ కలెక్టర్‌కు వినతిపత్రం అందజేస్తున్న ఆయా గ్రామాల ప్రజలు

కలిపిన 16 గ్రామాల ప్రజలు, విద్యార్థులు, రైతులు ఆడ, మగ తేడా లేకుండా గ్రామ విభేదాలను సైతం లెక్క చేయకుండా కలిసి కట్టుగా ఒకతాటిపైకి వచ్చిసోమవారం ఆదోనిలో భారీ ఎత్తున ర్యాలీలు చేపట్టి భీమాస్ కూడలి వద్ద రాస్తారోకో నిర్వహించి సబ్ కలెక్టర్, తహశీల్దార్, ఎంపిడిఓ కార్యాయాల వద్ద బైఠాయించి ఆందోళన చేపట్టారు. పెద్దహరివాణం వద్దు ఆదోని ముద్దు... కర్ణాటక సరిహద్దుల్లో ఉన్న పెద్దహరివాణంలో తమ గ్రామాలను ఎవరిని అడిగి కలిపారని ఆందోళన చేశారు. పెద్దహరివాణంలో తమ గ్రామాలను కలిపితే మాత్రం నాయకుల ఇండ్లను ప్రభుత్వ కార్యాలయాలను ముట్టడించి ఆందోళనకు దిగుతామని, తమ ప్రాణాలను పోయినా పెద్దహరివాణం మండలంలో తమ గ్రామాలను విలీనం కాకుండా అడ్డుకుంటామని హెచ్చరించారు. నేటి నుంచి ఉద్యమాలను ఉధృతం చేస్తామన్నారు.

ఇసుక అమ్ముకునే అవసరం లేదు..

● ఎమ్మెల్యే విరుపాక్షి అబద్ధాలు మాట్లాడడం మానుకోవాలి
● టీడీపీ రాష్ట్ర ఆర్గనైజింగ్ కార్యదర్శి వైకుంఠం శివప్రసాద్



సమావేశంలో మాట్లాడుతున్న వైకుంఠం శివప్రసాద్

ఆలూరు(హొళగుంద), డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): ఇసుకను అమ్ముకునే సంస్కృతి టీడీపీకి లేదని ఆలూరు ఎమ్మెల్యే అబద్ధాలు మానుకోవాలని టీడీపీ రాష్ట్ర ఆర్గనైజింగ్ కార్యదర్శి వైకుంఠం శివప్రసాద్ అన్నారు. సోమవారం హొళగుందలో గెస్ట్ హౌస్‌లో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. నియోజకవర్గంలో గత జగన్ ప్రభుత్వంలో విరుపాక్షి జెడ్పీటీసీగా వాళ్ల పార్టీ నుంచి ఎమ్మెల్యేగా ఉన్న చేసిందేమీ లేదని ప్రశ్నించారు. అదే మార్లమడికిని ఇసుక రీచ్‌గా ఎందుకు చేయలేదన్నారు. లారీలతో ఇసుకను తరలించ లేదా అన్నారు. చిప్పగిరికి చెందిన ఓ నాయకుడి ద్వారా మద్యాన్ని సరఫరా చేయించ లేదా అని ప్రశ్నించారు. నియోజవకర్గంలో మరో నాయకుడు వచ్చి పార్టీలో సీనియర్‌లను కలుపుకుపోవడం లేదని మాట్లాడడం సరి కాదన్నారు. పార్టీలో సీనియర్‌లను కలుపుకుపోయి రానున్న స్థానిక ఎన్నికల్లో హొళగుంద మండలంలో టీడీపీ జెండా ఎగుర వేస్తామన్నారు. ఇసుకపై విమర్శలు రాకుండా ఇసుక రీచ్ ఏర్పాటు చేస్తామన్నారు. ఆలూరులో టీడీపీ బలోపేతానికి టీడీపీ ఇన్‌చార్జి వైకుంఠం జ్యోతి చేస్తున్న కృషిని చూసి ఓర్వలేక ఇలా విమర్శలు చేయడం ఎమ్మెల్యే విరుపాక్షికి తగదన్నారు. అనంతరం సింగిల్‌విండో అధ్యక్షుడు విష్ణువర్ధన్‌రెడ్డి మాట్లాడుతూ 'పేరు కూడా సరిగ్గా పలకడం రాని నీవు తనపై ఆరోపణలు చేయడం సరికాదని, నేను నీలా ఓనమాలు రాని వాడిని కాదన్నారు. ఇంకోసారి తనపై విమర్శలు చేస్తే ఖబడ్దార్ అని ఎమ్మెల్యేను ఉద్దేశించి హెచ్చరించారు. టీడీపీ నాయకులు తిప్పయ్య, గోవింద్‌గౌడ్, మల్లికార్జున, ఆదాం, తోక వెంకటేష్, సుధాకర్‌పాల్గొన్నారు.

ప్రభుత్వం ఇచ్చిన హామీని నేరవేర్చాలి

బేడ, బుడగ, జంగం అధ్యక్షుడు తూర్పాటి మనోహర్



మాట్లాడుతున్న రాష్ట్ర అధ్యక్షుడు తూర్పాటి మనోహర్

వెల్దుర్తి/వెల్దుర్తిటౌన్ డిసెంబరు 1(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రమైన వెల్దుర్తిలో బేడ, బుడగ, జంగం సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు తూర్పాటి మనోహర్ సోమవారం విలేకర్ల సమావేశం నిర్వహించారు. రిజర్వేషన్ పరంగా ఉద్యోగాలు రాక అన్యాయానికి గురవుతున్న బేడ, బుడగ, జంగం కులానికి ఇచ్చిన హామిని నేరవేర్చాలని అన్నారు. ప్రస్తుతం ఢిల్లీలో జరుగుతున్న శీతకాల పార్లమెంటు సమావేశాల్లో రిజర్వేషను బిల్లును పార్లమెంటులో ఆమోదింపజేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో మద్దిలేటి, సుధాకర్, మధు, గణమద్దిలేటి, బాలు, జమ్మన్న తదితరులు పాల్గొన్నారు.

మినీ గోకులం షెడ్లను పూర్తి చేయాలి

హాలహర్వి, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): పాడి రైతుల కోసం ప్రభుత్వం నిర్మించే మినీ గోకులం షెడ్ల నిర్మాణాలను త్వరగా పూర్తి చేయాలని ఏపీఓ చక్రవర్తి పేర్కొన్నారు. సోమవారం ఆయన మాట్లాడుతూ గ్రామాల్లో పాడి రైతులకు రూ.2 లక్షలు చొపన గోకులం షెడ్లు మంజూరయ్యాయని, నిర్మాణ విషయంలో పూర్తి స్థాయిలో వెనకపడ్డారన్నారు. నిర్మాణం పనులు చేపట్టిన వెంటనే బిల్లులు ఇస్తామని తెలిపారు. గ్రామాల్లో ఫీల్డ్ అసిస్టెంట్లు బాధ్యతతో నిర్మాణాలు చేపట్టేవిధంగా చూడాలని సూచించారు.

రబీ పంటలకు బీమా

హాలహర్వి, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): రబీలో సాగుచేసిన జొన్న, శనగ, మొక్కజొన్న, సజ్జ పంటలకు బీమా చేయించుకోవాలని ఏఓ జిలానీబాష అన్నారు. సోమవారం ఆయన మాట్లాడుతూ రైతులు సాగుచేసిన పంటలపై ప్రకృతి వైపరీత్యాల వల్ల పంటలను నష్టపోతే బీమా ఆదుకుంటుందని, ప్రతిరైతు అవగాహన కల్పించుకుని ప్రీమియం చెల్లించి నష్టాల పాలుకాకుండా చూసుకోవాలన్నారు. నష్టపోయిన పంటలకు బీమా ఎంతో అండగా ఉంటుందన్నారు. ప్రతి గ్రామంలో రైతు భరోసా కేంద్రాలను సంప్రదించాలని ఆయన కోరారు.

ప్రత్యేక అవసరాల విద్యార్థులకు నేడు వైద్యపరీక్షలు

పత్తికొండ, డిసెంబరు 1(ఆంధ్రజ్యోతి): ప్రత్యేక అవసరాల విద్యార్థులకు మంగళవారం ప్రత్యేక వైద్యశిబిరం నిర్వహిస్తున్నట్లు భవిత కేంద్రం పాఠశాల ఉపాధ్యాయుడు శ్రీనివాసులు తెలిపారు. కర్నూలు నుంచి వచ్చే వైద్యులు ఈ పరీక్షలు నిర్వహిస్తారని అన్నారు. పత్తికొండ, తుగ్గలి, మద్దికెర, దేవనకొండ మండలాల విద్యార్థులకు వైద్యపరీక్షలు నిర్వహిస్తారన్నారు.

జీవిత సారంశమే భగవద్గీత

ఆదోని టౌన్, డిసెంబరు 01 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలోని జిహ్వేశ్వర విద్యాలయంలో సోమవారం గీతా జయంతి వేడుకలను ఎంతో ఘనంగా నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా పాల్గొన్న రిటైర్డ్ జిల్లా ఆడిట్ అధికారి సాకరే శంకర్రావు, ఎల్ఐసీ రిటైర్డ్ డివిజనల్ మేనేజర్ కామలే ఈరన్న మాట్లాడుతూ, భగవత్ గీత యొక్క ప్రాధాన్యత, ఆవశ్యకతలను గురించి విద్యార్థులకు వివరించారుస్వకుల సాలీ సమాజ్ అధ్యక్ష, కార్యదర్శులు, విశ్వ హిందూ పరిషత్ జిల్లా కోశాధికారి పాల్గొన్నారు.

దేవనకొండ: మానవుని జీవిత సారంశమే భగవద్గీత విశ్వహిందుపరిషత్ భీమేష్, రఘునాథ్ అన్నారు. స్థానిక ప్రైవేట్ పాఠశాలలో భగవద్గీత జయంతి వేడుక సందర్భంగా పుస్తాకాలను విద్యార్థులకు ఉచితంగా పంపీణి చేశారు. కార్యక్రమంలో విశ్వహిందుపరిషత్ నాయకులు నేలతలమర్రి రాముడు, కుంకనురు లింగారెడ్డి, పీఠాధిపతి రంగాచారి, బ్రహ్మయ్య, మల్లికార్జునరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

మద్దికెర: మండల కేంద్రంలోని మద్దికెర గ్రామంలోని నగరేశ్వరస్వామి ఆలయంలో గీతా జయంతి వేడుకలు ఘనంగా జరిగాయి. సోమవారం నగరేశ్వరస్వామి ఆలయంలో శ్రీకృష్ణ భగవానుని చిత్రపటానికి పూలమాలలు వేసి పూజలు చేశారు. మకార్యక్రమంలో నగిరి కిష్టన్న, మెడికల్ వీరేష్, మునిగేని జయకృష్ణ ఉన్నారు.

డిజిటల్ అసిస్టెంట్‌ను నియమించాలి



ఎంపీడీవోకు వినతి పత్రం అందజేస్తున్న సీపీఐ నాయకులు

పత్తికొండ టౌన్, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): చిన్నహుల్తి గ్రామ సచివాలయానికి డిజిటల్ అసిస్టెంట్‌ను నియమించాలని సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు రాజాసాహెబ్, మండల కార్యదర్శి కారుమంచి, సీనియర్ నాయకులు కారన్న, పెద్దహుల్తి శాఖ కార్యదర్శి సిద్దలింగప్ప డిమాండ్ చేశారు. సోమవారం పెద్దహుల్తి గ్రామశాఖ ఆధ్వర్యంలో ఎంపీడీఓకు వినతి పత్రం అందించారు. రెండు నెలలుగా సచివాలయంలో డిజిటల్ అసిస్టెంట్ లేకపోవడంతో అటు విద్యార్థులు, ఇటు ప్రజలకు పనులు జరగక నానా ఇబ్బందులు పడుతున్నారన్నారు. డిజిటల్ అసిస్టెంట్‌ను నియమించనిపక్షంలో ఎంపీడీవో కార్యాలయాన్ని ముట్టడిస్తామన్నారు. సీపీఐ పట్టణ కార్యదర్శి రామాంజనేయులు, దూదేకొండ ఎంపీటీసీ వీరన్న, రైతు సంఘం నియోజకవర్గ కార్యదర్శి సురేంద్రకుమార్, పెద్దహుల్లి మారన్న, ఉచ్చప్ప పాల్గొన్నారు.

ఎయిడ్స్ మహమ్మారిని తరిమికొడదాం



ఆదోని ఆర్ట్స్ కళాశాలలో విద్యార్థుల మానవహారం

ఆదోని అగ్రికల్చర్, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి) : ప్రజల్లో అవగాహనతోనే ఎయిడ్స్ వ్యాధిని నియంత్రించ వచ్చని ఆర్ట్స్ అండ్ సైన్స్ కళశాల ప్రిన్సిపల్ మురళీమోహన్ అన్నారు. సోమవారం ప్రపంచ ఎయిడ్స్ దినోత్సవాన్ని పురస్కరిం చుకొని విద్యార్థులు మానవహారం చేపట్టారు. ఎన్‌సీసీ విద్యార్థులు పురవీధులలో ర్యాలీ చేపట్టారు. అధ్యాపకులు యుగంధర్ రెడ్డి, ఎన్‌సీసీ డివిజన్ అధికారి జొనాథన్, ఉమాదేవి, వెంకట్ రెడ్డి, ఎన్‌సీసీ ఆఫీసర్ గోవిందు పాల్గొన్నారు.

తుగ్గలి: ఎయిడ్స్ మహమ్మారిని తరిమికొట్టడానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని తుగ్గలి, పగిడిరాఇ వైద్యులు రోజారమణి, అమర్నాథ్, అనిల్ అన్నారు. సోమవారం మండలంలోని తుగ్గలి, పగిడిరాయి వైద్యశాల పరిధిలో వైద్యులు, వైద్యసిబ్బంది ర్యాలీ నిర్వహించారు. వైద్య సిబ్బంది, మౌలాలి, రమేష్ పాల్గొన్నారు.

మద్దికెర: ఎయిడ్స్ అంటు వ్యాధి కాదని. ఎయిడ్స్ వ్యాధిగ్రస్థులను దూరంగా ఉంచాల్సిన అవసరం లేదని ప్రభుత్వ వైద్యాధికారిణి రాగిణి అన్నారు. సోమవారం స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ప్రపంచ ఎయిడ్స్ నివారణ దినోత్సవం పురస్కరించుకుని ర్యాలీ నిర్వహించి ప్రతిజ్ఞ చేశారు..సీహెచ్‌వో నిరంజన్‌బాబు, హెల్త్ ఎడ్యుకేటర్ అక్బర్ బాషా, ఆరోగ్య పర్యవేక్షకులు సూర్యనారాయణ, ల్యాబ్ టెక్నీషియన్ విజయకుమార్ ఉన్నారు.

16న సామూహిక వివాహాలు

● కల్లు మఠం, చౌకీ మఠం పీఠాధిపతులు



మాట్లాడుతున్న పీఠాధిపతులు

ఆదోని టౌన్, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి) : మైసూరు (కర్ణాటక) సమీపంలోని సుత్తూరు శ్రీ క్షేత్రంలో ఆది జగత్ గురువులు శివరాత్రిశ్వర శివ యోగి వారి జాతర మహోత్సవం సందర్భంగా ఈనెల 16వ తేదీన ప్రతి ఏడాదిలాగే ఉచిత సామూహిక వివాహాలను నిర్వహిస్తున్నట్లు కల్లుమఠం పీఠాధిపతి గురు శిద్ధ స్వామి, చౌకీమఠం పీఠాధిపతి మర్రి రాచోటి స్వామి తెలిపారు. కుల మతాలకు అతీతంగా జరిగే సామూహిక వివాహాలు గ్రామీణ ప్రజలకు కూడా అందుబాటులోకి తీసుకొని రావడం ఎంతో అవసరమని భావించి పర్యటిస్తున్నామని తెలిపారు. వీరశైవ సంఘం సభ్యులు ఎగ్గటి ప్రతాప్, మరియాని చెన్న బసప్ప పాల్గొన్నారు.

పెండింగ్ బకాయిలు చెల్లించాలి

దేవనకొండ, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): మండలంలోని గ్రామాలలో వలసలు నివారించి , పెండింగ్‌లో ఉన్న ఉపాధి పనుల బకాయిలను చెల్లించాలని ఎంపీడీవో కార్యాలయం ఎదుట వ్యవసాయ కార్మికసంఘం అధ్వర్యంలో ధర్నా చేశారు. ఆశోక్, బజారి, శ్రీనివాసులు, రఫీ, రంగడు,బలరాముడు, నాగేంద్ర, తదితరులు పాల్గొన్నారు.

చెరువును పరిరక్షించుకునే బాధ్యత మనదే

ఆదోని, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): రాంజల చెరువును పరిరక్షించుకునే బాధ్యత పుర ప్రజలపై ఉందని ఎమ్మెల్యే పి.వి. పార్థసారథి పేర్కొన్నారు. సోమవారం పట్టణ ప్రజల దాహార్తి తీరుస్తున్న పురాతన చెరువు రాంజలకు గీతా జయంతిని పురస్కరించుకుని జలహారతి కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే పార్థసారథి మాట్లాడుతూ ఈ ఏడాది సమృద్ధిగా వర్షాలు కురవడంతో రాంజల చెరువు పొంగి పొర్లిందన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక తాము నిధులు కేటాయించి శుభ్రపరిచి పరిరక్షించామన్నారు. ఎమ్మెల్సీ డాక్టర్ మధుసూదన్, చైర్‌పర్సన్ లోకేశ్వరి, వైస్ చైర్మన్ నరసింహులు, కల్లుమఠం పీఠాధిపతి గురుసిద్ధలింగ, దేవర రజక కార్పొరేషన్ రాష్ట్ర చైర్మన్ సావిత్రి, ఏపీ ఫుడ్ కమిషన్ మాజీ సభ్యురాలు గుడిసె కృష్ణమ్మ, విట్టా రమేష్, వేద పండితులు గరుడాద్రి దత్తాత్రేయశర్మ పాల్గొన్నారు.

కనకదాసు విగ్రహ ఏర్పాటుకు విరాళం

ఆలూరు(హొళగుంద), డిసెంబర్ 1 (ఆంధ్రజ్యోతి): గ్రామాభివృద్ధి, ప్రజల ఐక్యత కోసం తానెపుడూ ముందుతానని టీడీపీ సీనియర్ నాయకులు గోవింద్‌గౌడ్ అన్నారు. హొళగుంద మండలం ఎల్లార్తి గ్రామంలో భక్త కనకదాసు విగ్రహం ఏర్పాటుకు రూ.80 వేలు విరాళంగా అందజేశారు. ఈ సందర్భంగా ఎల్లార్తి గ్రామ సర్పంచ్ దర్గన్న, గాదిలింగప్ప, మల్లికార్జున, టీడీపీ మాజీ మండల కన్వీనర్ పి.వీరేష్‌గౌడ్, పెద్దహ్యాట మల్లయ్యలు ఆయనను సన్మానించారు.

పని వేళలు పాటించాలి

మద్దికెర, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): మండలంలోని సచివాలయ ఉద్యోగులు సమయ పాలన పాటించాలని సచివాలయ డిప్యూటీ ఎంపీడీవో శివకుమార్ తెలిపారు. సోమవారం మండల కేంద్రంలోని రెండో సచివాలయాన్ని తనిఖీ చేశారు. సచివాలయ ఉద్యోగులు క్రమం తప్పకుండా విధులకు రావాలన్నారు. సచివాలయ ఉద్యోగులు శ్రీకాంత్, యువరాజ్ ఉన్నారు.

ట్రాక్టరులోని వరిగడ్డి దగ్ధం

పత్తికొండ, డిసెంబరు 1(ఆంధ్రజ్యోతి): ట్రాక్టరులో తరలిస్తున్న వరిగడ్డికి కరెంటు తీగలు తగలడంతో దగ్ధమైన ఘటన పత్తికొండ బైపాస్ రోడ్‌లో సోమవారం జరిగింది. ఆలూరు చిందన ప్రకాశ్ ఆ ట్రాక్టర్‌లో వరిగడ్డిని విక్రయించేందుకు తీసుకెళ్తుండగా రామచంద్రాపురం రోడ్డులో కిందికి వేలాడుతున్న విద్యుత్ తీగలు వరిగడ్డికి తగలడంతో మంటలు చెలరేగాయి. డ్రైవర్ ప్రకాశ్ ట్రాక్టర్ దగ్ధం కాకుండా వరిగడ్డిని అన్‌లోడ్ చేశాడు. ఈ ఘటనలో స్వల్పగాయాలైన ప్రకాశ్ స్థానిక ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందాడు.

అన్నదానానికి విరాళం

చిప్పగిరి, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): చిప్పగిరిలో అయ్యప్పస్వామి మాల ధరించిన స్వాములకు 41 రోజుల నిత్య అన్నదాన కార్యక్రమానికి ఆలూరు ఎమ్మెల్యే విరుపాక్షి తనవంతు సాయంగా రూ.1.50 లక్షలు విరాళం అందించారు. మాలధారణ అయ్యప్పస్వామికి ఎంతో ప్రీతికరమైనదన్నారు. ఈ సందర్భంగా అయ్యప్పస్వామి భక్తులు ఎమ్మెల్యేకు కృతజ్ఞతలు తెలిపారు.

సీసీఐ కేంద్రం ఏర్పాటు చేయాలి

దేవనకొండ, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): మండలంలో ప్రధాన పంటగా రైతులు పత్తి పంటను సాగు చేయడంతో పత్తి పంట అమ్మకం కోసం దేవనకొండలో సీసీఐ కేంద్రం ఏర్పాటు చేయాలని సీపీఎం జిల్లా నాయకులు వీరశేకర్, సీపీఐ మండల కార్యదర్శి నర్సారావ్ అన్నారు

కూటమి రైతు ప్రభుత్వం: టీడీపీ



జగ్గాపురంలో ఎరువులు పంపిణీ చేస్తున్న టీడీపీ నాయకులు

నందవరం, డిసెంబరు 1(ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వం రైతుల ప్రభుత్వం అని టీడీపీ మాజీ ఎంపీటీసీ గడంగం నరసింహులు, గట్టాల రంగన్న అన్నారు. సోమవారం రైతన్న మీ కోసంలో భాగంగా రైతులకు ఎరువులు పంపిణీ చేశారు.వారు యారి యా కోసం వచ్చిన రైతులకు కరపత్రాలు అందజేస్తు కూటమి ప్రభు త్వం రైతులకు అన్ని రకాలు తోడ్పాటునందిస్తుందన్నారు. ఎమ్మెల్యే బీవీ జయనాగేశ్వరరెడ్డి ఆదేశాల మేరకు ఇంటింటా తిరుగుతూ రైతులకు ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాల గురించి వివరించారు. కార్యక్రమంలో నాయకులు తిమ్మప్ప, ఎల్ఐసీ గోపాల్, దస్తగిరి, ఆంజినేయులు పాల్గొన్నారు.

చంద్రబాబు పాలనలోనే ముస్లింలకు న్యాయం



కోసిగిలో రాఘవేంద్రరెడ్డిని సన్మానిస్తున్న ముస్లిం మైనార్టీల నాయకులు

కోసిగి, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుతోనే ముస్లిం మైనార్టీలకు న్యాయం జరుగుతుందని మంత్రాలయం టీడీపీ ఇన్‌చార్జి ఎస్.రాఘవేంద్ర రెడ్డి అన్నారు. సోమవారం కోసిగిలో ముస్లిం నాయకులు గౌస్, ఖలందర్, షబ్బీర్, టంకం గౌస్, అవిదా దాదా, వలి, నూర్, నిజాముద్దీన్, అన్వర్ పెద్ద ఎత్తున మంత్రాలయం టీడీపీ ఇన్‌చార్జి రాఘవేంద్ర రెడ్డికి సన్మానించారు. అనంతరం కోసిగిలోని ముస్లిం మైనార్టీకి చెందిన షాదీఖానను పరిశీలించారు.

రాష్ట్ర స్థాయి పోటీల్లో ప్రతిభ



రజిత పతకం, ట్రోఫీలను చూపిస్తున్న విద్యార్థినులు అఖిల, రూపికలు

మంత్రాలయం, డిసెంబరు 1(ఆంధ్రజ్యోతి): మంత్రాలయం జడ్పీ ఉన్నత పాఠశాలకు చెందిన 10వ తరగతి చదువుతున్న అఖిల, రూపిక అనే విద్యార్థులు రాష్ట్రస్థాయిలో గెలుపొంది రజిత పతకాన్ని సాధించినట్లు సోమవారం హెచ్ఎం విఠోభ రావు, ఫిజికల్ డైరెక్టర్లు రవీంద్ర, నరసింహరాజు తెలిపారు. రాష్ట్ర స్థాయి ఎస్‌జీఫ్ అండర్-19 విభాగంలో గట్కా పోటీల్లో విశేష ప్రతిభ కనపర్చి రజిత పతకం సాధించి మంత్రాలయానికి గుర్తింపు తెచ్చారని తెలిపారు. కర్నూల్ జిల్లా జట్టు తరపున అత్యధిక పాయింట్లు సాధించి రాష్ట్రస్థాయిలో 2వ స్థానం దక్కించుకున్నారు. క్రీడల్లో విశేష ప్రతిభ కనపర్చిన విద్యార్థులను ఉపాధ్యాయులు పాపాన్న, గోపాల్, చంద్రశేఖర్, ప్రసన్నకుమారి అభినందించారు.

విద్యార్థులకు వ్యవసాయంపై అవగాహన అవసరం



ఏపీ మోడల్‌స్కూల్ వద్ద విద్యార్థులతో వ్యవసాయ శాస్త్రవేత్తలు, అధికారులు

మంత్రాలయం, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులకు వ్యవసాయంపై అవగాహన అవసరమని శాస్త్రవేత్తలు తేజ, భూసార పరీక్ష కేంద్ర వ్యవసాయ అధికారులు ఇందుమతి, నవీన్ అన్నారు. సోమవారం రచ్చమర్రి ఏపీ మోడల్ స్కూల్ విద్యార్థులకు మండల ఏవో జీరా గణేష్, ప్రిన్సిపాల్ అశోక్ నాయక్ ఆధ్వర్యంలో మట్టి నమూనా సేకరించే పద్ధతులు, భూసార పరీక్షలు, వ్యవసాయ రంగంలో ఆధునికీకరణ పద్ధతులతో పంటలు సాగుచేసే విధానాలపై అవగాహన కల్పించారు. రసాయన ఎరువులు, క్రిమిసంహారక మందులను వాడడం వల్ల కలిగే నష్టాలను వివరించారు. కార్యక్రమంలో ప్రసాద్, ఏఈవో హరి, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

మట్టి నమూనాపై విద్యార్థులకు అవగాహన

నందవరం, డిసెంబరు 1(ఆంధ్రజ్యోతి): మట్టి నమూనాలను తీసే పద్ధతిపై విద్యార్థులకు అవగాహన ఉండాలని వ్యవసాయ అధికారి సరిత అన్నారు. సోమవారం మండలంలోని ముగతి గ్రామంలోని మోడల్ స్కూల్లో ప్రిన్సిపాల్ చంద్రశేఖర్ ఆధ్వర్యంలో విద్యార్థులకు స్కూల్ సాయిల్ హెల్త్ ప్రోగ్రాం కింద అవగాహన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమం టీచర్లు ప్రియాంక, బనవాసి శాస్త్రవేత్తతేజ పాల్గొన్నారు.

కోసిగిలో ఘనంగా గీతా జయంతి



మాట్లాడుతున్న తహసీల్దార్ వేణుగోపాల్

కోసిగి, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): కోసిగిలోని 5వ వార్డులో గీతా మందిరంలో గీతా జయంతి సందర్భంగా సోమవారం శ్రీకృష్ణ భగవానుడికి ప్రత్యేక పూజలు చేశారు. గీతా జయంతి ప్రాముఖ్యత వివరిస్తూ భగవద్గీత గురించి భక్తులకు బ్రహ్మనిష్ట స్వాత్మానంద స్వామీజీ, శ్రీనివాస స్వామి ప్రజలకు తెలియజేశారు. అర్జునుడికి శ్రీకృష్ణుడు అందించిన భగవద్గీత నేటికి మానవ జీవితానికి నేటికి మార్గదర్శకంగా నిలుస్తుందని, ధర్మం, కర్తవ్యం, మనో నిగ్రహం, ఆత్మ జ్ఞానం వంటి విలువలు ప్రపంచానికి పరిచయం చేసిన ఈ మహోన్నత గ్రంథం తరతరాలకు పరిచయం చేసిందని తెలియజేశారు.

● **కంఠస్థ పోటీలో బహుమతి ప్రదానం**

గీతా జయంతి సందర్భంగా రెండు రోజులుగా భగవద్గీత కంఠస్థ పోటీలు నిర్వహించారు. ఈ పోటీల్లో ఆయా పాఠశాలలకు సంబందించి 350 మంది విద్యార్థులు పాల్గొన్నారు. నర్సరీ నుంచి 10వ తరగతి వరకు విద్యార్థులు పోటీల్లో పాల్గొనగా.. విజేతలుగా చైతన్య, లాస్యప్రియ, అరిగి వివేక్, ముకుంద అరుణజ్యోతి, జాహ్నవి, నితీష్, కవిత, ప్రియ నిలువగా కోసిగి తహసీల్దార్ వేణుగోపాల్, ఎస్ఐ రమేష్ రెడ్డి చేతుల మీదుగా బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో కొల్లి రామకృష్ణ, శ్రీనివాసుల శెట్టి, ఎరిగేరి శ్రీనివాసులు, డాక్టర్ గోపాల్, బావిగడ్డ వెంకటేష్, కుమార్ దొర శ్యాందొర, కృష్ణమూర్తి, సాయి కుమార్, గోవర్ధన్, సురేష్ పాల్గొన్నారు.

హామీలన్నీ నెరవేరుస్తాం: ఎమ్మెల్యే బీవీ



నాగలాపురం గ్రామంలో పింఛన్లను అందజేస్తున్న ఎమ్మెల్యే బీవీ జయనాగేశ్వరరెడ్డి



కోసిగిలోని మైనార్టీ కాలనీలో పింఛన్లు పంపిణీ చేస్తున్న మంత్రాలయం టీడీపీ ఇన్‌చార్జి రాఘవేంద్ర రెడ్డి

ఎమ్మిగనూరు రూరల్, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): ఎన్నికల ముందు ఇచ్చిన ప్రతిహామీని కూటమి ప్రభుత్వం నెరవేరుస్తుందని ఎమ్మెల్యే బీవీ జయనాగేశ్వరరెడ్డి అన్నారు. సోమవారం మండల పరిధిలోని కె.నాగలాపురం గ్రామంలో వృద్ధులు, దివ్యాంగులు, వితంతువులకు పింఛన్లను పంపిణీ చేశారు. అనంతరం గ్రామంలోని పాఠశాలను సందర్శించి విద్యార్థులు, ఉపాధ్యాయులతో మాట్లాడి అక్కడ ఏమైనా సమస్యలు ఉన్నాయా లేదా అని అడిగి తెలుకున్నారు. అనంతరం గ్రామంలో నూతనంగా ఏర్పాటు చేసిన సీసీ రోడ్డును ప్రారంభించారు.

కోసిగి: బడుగు బలహీనవర్గాలకు ఎన్టీఆర్ భరోసా పించన్లు భరోసా ఇస్తుందని మంత్రాలయం టీడీపీ ఇన్‌చార్జి రాఘవేంద్ర రెడ్డి అన్నారు. సోమవారం కోసిగిలోని మైనార్టీ కాలనీలో ఎన్టీఆర్ భరోసా పించన్ల పంపిణీ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఆయన హాజరయ్యారు. టీడీపీ కోసిగి మండల అధ్యక్షుడు పల్లెపాడు రామిరెడ్డి, టీడీపీ జిల్లా అధ్యక్షుడు ముత్తురెడ్డి ఆధ్వర్యంలో పించన్ల పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో తహసీల్దార్ వేణుగోపాల్, ఎంపీడీవో మహబూబ్ బాషా, మార్కెట్ యార్డు చైర్మన్ చింతలగేని నర్సారెడ్డి, మాజీ జడ్పీటీసీ తోవి రామకృష్ణ, ఆర్లబండ సొసైటీ చైర్మన్ నాడిగేని అయ్యన్న, వక్రాణి వెంకటేశ్, సాతనూరు కోసిగయ్య, వీరేష్, ఖలందర్, గౌస్ పాల్గొన్నారు.

నందవరం: పార్టీలకతీతంగా పించన్లు కూటమి ప్రభుత్వం పంపిణీ చేస్తుందని టీడీపీ బీసీ సెల్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఈరన్నగౌడు, పూల చింత బండేగురుస్వామి అన్నారు. సోమవారం మండల పరిధిలోని ముగతిలో ఈరన్నగౌడు ఆధ్వర్యంలో పూలచింతలో మఠం బండేగురు స్వామి ఆధ్వర్యంలో పించన్లు పంపిణీ చేశారు. అలాగే మాచాపురంలో మండల పార్టీ కన్వీనర్ కాశీంవలీ, వలీ, హాలహర్విలో రైస్‌మిల్ నారాయణరెడ్డి, ధర్మాపురంలో సహకార సంఘం మండల అధ్యక్షుడు గోపాల్, కనకవీడులో ఈరన్న, నదీకైరవాడిలో వీరేష్, నాగలదిన్నెలో ఈరన్న, మునాఫ్, జగ్గాపురంలో నరసింహులు పంపిణీ చేశారు.

గోనెగండ్ల: కూటమి ప్రభుత్వంలోనే గ్రామాల అభివృద్ధి సాధ్యం అని రాష్ట్ర కురుబ కార్పొరేషన్ డైరెక్టర్ రామకృష్ణ అన్నారు. సోమవారం గాజులదిన్నె గ్రామంలో ఆయన పించన్లను పంపిణీ చేశారు. కార్యక్రమంలో గాజులదిన్నె మాజీ సర్పంచ్ యాకోబ్, ఉపసర్పంచ్ రాజు, రాముడు, నాయకులు, ఉద్యోగులు పాల్గొన్నారు.

మంత్రాలయం: రాష్ట్రంలో అభివృద్ధితో పాటు సంక్షేమాన్ని అమలు చేయాలంటే ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడుతోనే సాధ్యమని అన్నారు. సోమవారం మం త్రాలయం, సూగూరు, చెట్నహళ్లి, రచ్చమర్రి, మాలపల్లి గ్రామాల్లో జరిగిన పించన్ల పంపిణీలో నాయకులు టీడీపీ పట్టణ అధ్యక్షులు వరదరాజు, ఎంపీటీసీ మేకల వెంకటేష్, టీడీపీ మండల నాయకులు రాజు, వెంకటేష్, లక్ష్మయ్య, ఎస్పీ భాస్కర్ రెడ్డి, కాలువ చైర్మన్ నరసింహులు, సొసైటీ డైరెక్టర్ చాపల నాగేష్, శివ, ఎంపీటీసీ గోపాల్, రామకృష్ణ, నీలకంఠ, రాముడు, బొజప్ప, రజాక్, చావడి జయరావ్ పాల్గొన్నారు.

కౌతాళం: కౌతాళంలో టీడీపీ జిల్లా ఉపాధ్యక్షుడు చెన్నబసప్ప, కౌతాళం సొసైటీ చైర్మన్ వెంకటపతిరాజు వల్లూరులో అడివప్పగౌడ్‌లు ఆయా వార్డుల్లో టీడీపీ నాయకులతో కలిసి పించన్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు కాశీవిశ్వనాథ, సిద్దు, రాజానందు, కురువ వీరేష్ ఉన్నారు.

బీసీలకు అండగా ఉంటా : ఎమ్మెల్యే



ఎమ్మెల్యేను సన్మానిస్తున్న కురువ సంఘం నాయకులు

మంత్రాలయం, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): బీసీల సంక్షేమము వారి అభివృద్ధే ధ్యేయంగా వారికి అన్ని విధాలుగా అండగా ఉంటానని ఎమ్మెల్యే బాలనాగిరెడ్డి అన్నారు. సోమవారం సుంకేశ్వరి గ్రామంలో కురువ కమ్యూనిటీ హాలు నిర్మాణానికి రాజ్యసభ ఎంపీ నిధుల నుంచి మంజూరైన రూ.15.20లక్షల చెక్కును అందజేశారు. రాంపురంలో వైసీపీ మండల అధ్యక్షులు గురె డ్డిభీమిరెడ్డి ఆధ్వర్యంలో కురువ సంఘం నాయకులు పూజారి బీరప్ప, గులెప్ప, పూజారి ముక్కరప్ప, నర్సప్ప, నాగప్పలు గజమాల తో ఎమ్మెల్యేను సన్మానించారు. కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీ రఘునాథరెడ్డి, చంద్రప్ప, సర్పంచు ముక్కరన్న, అయ్యప్ప, శ్రీనివాసులు, మల్లయ్య, వీరేష్, నాగిరెడ్డి, లింగన్న, భీమన్న, వీరేష్ పాల్గొన్నారు.

అంబేడ్కర్ ఓపెన్ యూనివర్సిటీ ఫీజును ఆన్‌లైన్‌లో చెల్లించాలి

ఎమ్మిగనూరు, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ ఓపెన్ యూనివర్సిటీ పరిధిలో బీఏ, బీకాం, బీఎస్సీ గ్రూపుల్లో మొదటి, మూడో, నాలుగు ఏడాది సెమిస్టర్ పరీక్షా ఫీజును ఆన్‌లైన్‌లో చెల్లించేందుకు ఈనెల 27వ తేదీ చివరి రోజు అని ఓపెన్ యూనివర్సిటీ కో-ఆర్డినేటర్ బలరాముడు సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఓపెన్ యూనివర్సిటి పరిధిలో చదువుతున్న విద్యార్థులు పరీ క్ష ఫీజును సకాలంలో చెల్లించాలని కోరారు. వివరాలకు ఎస్ఎంఎల్ డిగ్రీ కళాశాల స్టడీ కౌంటర్‌లను 7382929823లకు సంప్రదించాలని కోరారు.

దోబీఘాట్ ఆక్రమించిన వారిపై చర్యలు తీసుకోవాలి

ఎమ్మిగనూరు, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): ఎమ్మిగనూరు మండలం కలుగొట్ల గ్రామంలో దోబీఘాట్ స్థలాన్ని ఆక్రమించిన వారిపై చర్యలు తీసుకోవాలని టీడీపీ మండల కన్వీనర్ కేటీ వెంకటేష్, గ్రామ నాయకులు కొండన్నగౌడ్, శంకర్‌గౌడ్, గ్రామస్థులు సత్యన్న, రజకులు యల్లమ్మ, లక్ష్మీ, నరసమ్మ, బజారి డిమాండ్ చేశారు. సోమవారం తహసీల్దార్ శేషఫణిని కలిసి వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో రాము, బుడ్డ ఈరన్న పాల్గొన్నారు.

పత్తి రైతులను ఆదుకోవాలి



తహసీల్దారుకు వినతిపత్రం ఇస్తున్న రైతు సంఘం నాయకులు

మంత్రాలయం, డిసెంబరు1 (ఆంధ్రజ్యోతి): సీసీఐ నిబంధనలను తక్షణమే ఎత్తివేసి పత్తి రైతులను ఆదుకోవాలని రైతుసంఘం నాయకులు జయరాజు, వీరేష్, అనిల్‌కుమార్, ప్రాణేష్ అన్నారు. సోమవారం పత్తి రైతులపై తహసీల్దారు కార్యాలయం ముందు ధర్నా చేశారు. వారు మాట్లాడుతూ సీసీఐ నిబంధనల వల్ల చేతికొచ్చిన పంటను పూర్తి అమ్మలేకపోతున్నారని ఆరోపించారు. నష్టపోయిన పత్తి రైతులకు నష్ట పరిహారం అందించి ఆదుకోవాలని డిమాండ్ చేశారు. ఈ ధర్నా లో రైతు సంఘం నాయకులు యోగప్ప, నరసింహులు కాశీం పాల్గొన్నారు.

నకిలీ సర్టిఫికెట్లతో ఉద్యోగం పొందిన వారిపై విచారణ చేపట్టాలి

ఎమ్మిగనూరు రూరల్, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): నకిలీ సర్టిఫికెట్లతో ఉద్యోగం పొందిన వారిపై విచారణ జరపాలని ఎస్ఎస్‌యూఐ జిల్లా అధ్యక్షులు వీరేష్‌యాదవ్ డిమాండ్ చేశారు. సోమవారం ఆయన మాట్లాడుతూ సచివాలయ ఉద్యోగుల్లో కొంతమంది ఎనిమల్ హస్బండరి ఉద్యోగాలకు నకిలీ సర్టిఫికెట్లు పెట్టి ఉద్యోగాలు పొందారన్నారు. రాష్ట్రంలో మొత్తం 1200 మంది ఉద్యోగులు దొంగ సర్టిఫికెట్లతో ఉద్యోగాలు సంపాదించారని ఆరోపించారు. అలాగే కొంతమంది కంప్యూటర్ ఆపరేటర్లుగాను, డేటా ఎంట్రీ ఆపరేటర్లుగా పనిచేస్తునే రెగ్యులర్ కోర్సులు చేసి అదనపు మార్కులు వేయించుకున్నారన్నారు. దాదాపు 1200 పైచిలుకు ఉద్యోగులు నకిలీ సర్టిఫికెట్లు పెట్టి ఉద్యోగాలు పొందిన వారిని ఉద్యోగాల నుంచి తొలగించి, వారి స్థానంలో కొత్త వారిని ఎంపిక చేయాలన్నారు. సమావేశంలో రాజు, శ్రీనివాసు, మన్సూర్, రమేష్ పాల్గొన్నారు.

తరతరాలుగా సాగులో ఉన్న రైతులకే భూములివ్వాలి



మంత్రాలయం రాఘవేంద్ర సర్కిల్‌లో ధర్నా చేస్తున్న రైతులు

మంత్రాలయం, డిసెంబరు 1(ఆంధ్రజ్యోతి): తరతరాలుగా శ్రీమఠం భూములను సాగుచేస్తూ జీవనం చేస్తున్న రైతులకే భూములు చెందేలా అధికారులు న్యాయం చేయాలని డిమాండ్ చేస్తూ మంత్రాలయం రావేంద్రసర్కిల్‌లో, కర్నూల్‌లో కలెక్టరేట్ మహాత్మగాంధీ విగ్రహం ముందు ధర్నా నిర్వహించారు. సోమవారం మంత్రాలయం రాఘవేంద్ర సర్కిల్‌లో తమకు న్యాయంచేయాలని రైతులు ధర్నా నిర్వహించారు. ధర్నాలో రైతులు నర్సప్ప, భీముడు, మల్లేష్, నర్సప్ప, భీమేష్, అడవిరాజు, ప్రవీణ్, సునీల్, అగ్రీష్‌లు పాల్గొన్నారు.

ఉరుకుందలో ప్రత్యేక పూజలు

కౌతాళం, ఢిశంబరు 1(ఆంధ్రజ్యోతి): జిల్లాలో ప్రసిద్ధ పుణ్యక్షేత్రాలలో ఒకటైన ఉరుకుంద ఈరన్న స్వామి దేవాలయం నందు సోమవారం స్వామి వారం కావడంతో దేవాలయం నందు భక్తుల సందడి కొనసాగింది. స్వామి వారం కావడంతో దేవాలంలో భక్తుల రద్దీ కొనసాగింది.

నిర్లక్ష్యం వద్దు

మంత్రాలయం, డిసెంబరు 1(ఆంధ్రజ్యోతి): ఈనెలలో జరిగే మెగా పేరెంట్స్ మీటింగ్‌లో నిర్లక్ష్యం వహించకుండా పాఠశాలకు అవసరమైన విషయాలపై సమావేశాన్ని నిర్వహించాలని ఎంఈవో రాఘన్న అన్నారు. సోమవారం మంత్రాలయంలో మండలంలోని అన్ని పాఠశాలల హెచ్ఎంలతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈసమావేశంలో మెగా పేరెంట్స్ మీటింగ్, ఎఫ్ఎల్ఎన్ సర్వే, మధ్యాహ్నభోజనం, పదవ తరగతిలో వందశాతం ఉత్తీర్ణత, యాక్షన్‌పాలన్ వంటి అంశాలపై చర్చించారు.

సురక్షితమైన జీవనశైలిని అలవర్చుకోవాలి



ర్యాలీలో పాల్గొన్న ఎమ్మెల్యే బీవీ జయనాగేశ్వర్‌రెడ్డి

ఎమ్మిగనూరు, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): ప్రజలు సురక్షితమైన జీవనశైలిని అలవరుచుకోవాలని ఎమ్మెల్యే బీవీ జయనాగేశ్వరరెడ్డి అన్నారు. సోమవారం అంతర్జాతీయ ఎయిడ్స్ దినోత్సవాన్ని పురస్కరించుకొని స్థానిక జడ్పీ బాలికోన్నత పాఠశాల నుంచి సోమప్ప సర్కిల్ వరకు జడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థినులతో కలిసి అవగాహన ర్యాలీని నిర్వహించారు. అలాగే విద్యార్థినులతో ప్రతిజ్ఞ చేయించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ సమాజం ఎయిడ్స్ బాధితులపై వివక్షత చూపకుండా వారిని ప్రోత్సహించాలన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ గంగిరెడ్డి, ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ ఆదినాగేష్, హెచ్.ఎం. కృష్ణమూర్తి, ఎంఈవో మధుసుదన్‌రాజు, టీడీ పీ నాయకులు రాందాసుగౌడ్, మిన్నప్ప, రామకృష్ణనాయుడు, రంగస్వామి గౌడ్, గిరి, ఉరుకుందు, అల్తాఫ్, రాళ్లదొడ్డి మురళికృష్ణారెడ్డి, విజయమహిళా మండలి నిర్వాహకులు వేణుగోపాల్ పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికి చర్యలు

పట్టణంలోని బాలికోన్నత పాఠశాలలో సోమవారం ఎమ్మెల్యే బీవీ జయనాగేశ్వరరెడ్డి పాఠశాల పరిస్థితులపై అధ్యాపకులతో సమీక్షించారు. ఈ సందర్భంగా వారు విద్యుత్ సరఫరా, తాగునీరు, భవనాలు, మౌలిక వసతుల వంటి సమస్యలను ఎమ్మెల్యే దృష్టికి తీసుకువచ్చారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ విద్యుత్ సమస్యలను పరిష్కరించాలని విద్యుత్ శాఖ అధికారులను, తాగునీటి సమస్యపై మున్సిపల్ అధికారులను ఆదేశించారు. భవనాలు, ఇతర మౌలిక వసతులపై సంబందిత శాఖాధికారులు పరిశీలించి చర్యలు తీసుకోవాలని సూచించారు.

కోసిగి: ఎయిడ్స్ అంటూ వ్యాధి కాదని ప్రభుత్వ వైద్యులు ఇబ్రహీం, రాజ్ కిరీటీలు అన్నారు. సోమవారం ప్రపంచ ఎయిడ్స్ డే సందర్భంగా కోసిగి ప్రభుత్వ ఆసుపత్రి ముందు ర్యాలీ నిర్వహించి విద్యార్థులతో కలిసి ప్రతిజ్ఞ చేశారు. అనంతరం కోసిగిలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో డా.రాజ్‌కిరీటీ విద్యార్థులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో డా.మౌనిక, సామాజిక ఆరోగ్య అధికారి, ఈశ్వరమ్మ, ఆరోగ్య విస్తరణ అధికారులు శ్రీనివాసులు, ఎల్లప్ప, ఆరోగ్య కార్యకర్త మల్లికార్జున, వైద్య సిబ్బంది వేమారెడ్డి, భాగ్యమ్మ, శ్రీదేవి పాల్గొన్నారు.

కొనసాగుతున్న కార్మికుల దీక్ష



వైఎస్ఆర్ సర్కిల్‌లో నిరసన తెలుపుతున్న మృతి చెందిన కార్మికుల కుటుంబ సభ్యులు, నాయకులు

ఎమ్మిగనూరు టౌన్, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి) : మరణించిన కార్మికుల కుటుంబ సభ్యులు ఉద్యోగాలు కల్పించాలని కోరుతూ మున్సిపల్ కార్యాలయం ఎదుట చేపట్టిన రిలే నిరాహార దీక్షలు 15వ రోజుకు చేరుకుంది. సోమవారం మున్సిపల్ కార్యాలయం ముందు ఏఐటియుసీ, ఐఎఫ్టీయూ ఆధ్వర్యంలో మున్సిపల్ కార్యాలయం నుంచి వైఎస్ఆర్ సర్కిల్ వరకు నినాదాలతో ర్యాలీగా వెళ్లి సర్కిల్‌లో నిరసన చేట్టారు. అనంతరం కార్యాలయం ముందు కూర్చొని పట్టిన రిలే దీక్ష చేపట్టారు. కార్యక్రమంలో సీపీఐ పట్టణ కార్యదర్శిలు రంగన్న, ఆశా జ్యోతి, ఆగారమ్మ, సుమాంజలి, నబి నసిమా, లక్ష్మి, శేకర్, ఎల్లప్ప పాల్గొన్నారు.

ఆరోగ్యం పట్ల శ్రద్ధ తీసుకోవాలి



మాట్లాడుతున్న సివిల్ జడ్జి పి.హేమ

ఎమ్మిగనూరు రూరల్, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): ఆరోగ్యంపట్ల అందరు శ్రద్ధ తీసుకోవాలని జూనియర్ సివిల్ జడ్జి, మండల న్యాయ సేవాధికార సంస్థ అధ్యక్షురాలు పి.హేమ అన్నారు. సోమవారం ప్రపంచ ఎయిడ్స్ దినోత్సవాన్ని పురస్కరించుకొని స్థానిక ఐసీడీఎస్ కార్యాలయంలో న్యాయ విజ్ఞాన అవగాహన సదస్సును సీడీపీవో సఫరున్నిసా బేగం అధ్యక్షతన నిర్వహించారు. జడ్జి మాట్లాడుతూ అంగన్వాడీ టీచర్లు, ఆయాలు, సిబ్బంది ప్రజలకు ఎన్నో రకాల సేవలు అందిస్తున్నారన్నారు. అలాగే ఎయిడ్స్ వ్యాధి పట్ల చిన్నారుల తల్లిదండ్రులకు అవగాహన కల్పించాలని సూచించారు. కార్యక్రమంలో న్యాయవాలు లింగమూర్తి, కృష్ణ, సల్మాన్, ప్రసాద్, ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు రాధా, నాగలక్ష్మి, కోర్టు కానిస్టేబుల్ పెద్దనెలటూరు రామాంజనేయులు, కోర్టు సిబ్బంది రాజు పాల్గొన్నారు.

ప్రయోగాత్మక విద్య జీవితాన్ని మారుస్తుంది



రాయచూరు విశ్వవిద్యాలయంలో విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న అధ్యాపకులు

మంత్రాలయం, డిసెంబరు 1(ఆంధ్రజ్యోతి): ప్రయోగాత్మకంగా చూసి వాటి వల్ల నేర్చుకున్న సందేశంతోనే విద్యార్థుల జీవితం ముందుకెళ్తుందని ప్రిన్సిపాల్ అశోక్‌కుమార్ అన్నారు. సోమవారం మోడల్ స్కూల్ విద్యార్థులతో పీఎంశ్రీ కింద కర్నాటకలోని రాయచూరు వ్యవసాయ విశ్వ విద్యాలయం, రీజనల్ సైన్సు సెంటర్‌ను సందర్శించారు. విజ్ఞాన యాత్రలో భాగంగా అధ్యాపక బృందం సమక్షంలో టెలిస్కోప్, మానవ శరీర నిర్మాణం వంటి వైజ్ఞానిక అంశాలను స్వయంగా ప్రయోగాత్మకంగా విద్యార్థులకు వివరించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు ప్రసాదు, సోమలింగం, షరీఫ్‌వళి, వైష్ణవి, సోఫియా, ప్రవీణ్‌కుమార్, షబ్బీర్, పదవ తరగతి, ఇంటర్ విద్యార్థులు పాల్గొన్నారు.

వెల్డర్‌కు గాయాలు

కోసిగి, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): కోసిగి కస్తూర్బా గాంధీ బాలికల పాఠశాలలో వెల్డింగ్ పనులు చేస్తున్న ఎమ్మిగనూరు చెందిన షావలి అనే కూలీ కాలుజారీపై నుంచి కింద పడి తీవ్రగాయాలైన సంఘటన సోమవారం కోసిగిలో చోటు చేసుకుంది. 108 ఈఎంటీ రామకృష్ణ పైలట్ బసవ తెలిపిన వివరాల మేరకు కేజీబీవీ పాఠశాలలో రెండో అంతస్తులో వెల్డింగ్ పనులు చేస్తూ కాలుజారీ కింద పడిపోవడంతో తీవ్రంగా గాయపడ్డాడు. చికిత్స నిమిత్తం ఆదోని ప్రభుత్వ ఆసుపత్రికి తరలించామని పాఠశాల ప్రిన్సిపాల్ తెలిపారు.

రూ. 3 కోట్లతో రహదారి మరమ్మతులు



ఎమ్మిగనూరు పట్టణ సమీపంలో రోడ్డుకు మరమ్మతులు చేస్తున్న దృశ్యం

ఎమ్మిగనూరు, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వం రహదారుల మరమ్మతులపై ప్రత్యేక దృష్టి సారించింది. ప్రధాన రహదారుల మరమ్మతులకు చర్యలు తీసుకుంది. ఎక్కడెక్కడ గుంతలు పడ్డాయో వాటిని గుర్తించి వాటి మరమ్మతులకు నిధులు కేటాయించింది. ఇందులో భాగంగా ఎమ్మిగనూరు పట్టణం నుంచి గోనెగండ్ల రోడ్డులోని ఏడుమోరీల వరకు దాదాపు 4కి.మీ మధ్యలో రూ.3కోట్లతో మరమ్మతులు చేపట్టేందుకు చర్యలు తీసుకుంది. ఐదారు రోజులుగా పట్టణం నుంచి ఏడు మోరీల వరకు ప్రధాన రహదారిలో పనులను ఆర్అండ్‌బీ అధికారులు ప్రారంభించారు. పట్టణ పరిధిలో పూర్తిగా నీరు నిల్వ ఉండే ప్రాంతాల్లో మొత్తం సీసీరోడ్డు వేయడంతో పాటు నిరు నిలవని ప్రాంతాల్లో బీటీ రోడ్డును వేసేందుకు అధికారులు ముమ్మరంగా పనులు చేస్తున్నారు. గత వైసీపీ ప్రభుత్వంలో రహదారుల అభివృద్ధికి ఎలాంటి నిధులు కేటాయించకపోవడంతో ప్రధాన రహదారులన్నీ గుంతలమయంగా మారి ఎంతో మంది ప్రయాణిలకు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. అంతేగాక కొన్ని చోట్ల ప్రమాదాలు జరిగి ప్రయాణికులు ప్రాణాలు కోల్పోవడమేగాక, ఎంతో మంది క్షతగాత్రులుగా మారిన సంఘటనలు ఉన్నాయి. అయితే కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే ఎమ్మిగనూరు-కర్నూలు రహదారిలో గుంతలు పడిన వాటనన్నింటిని పూడ్చివేశారు. అయితే ఇటీవల కురిసిన వర్షాలకు కొంతమేర డ్యామేజీ కావడంతో శాశ్విత మరమ్మతులు చేపట్టారు. ఈ పనులు పూర్తయితే ప్రయాణికులకు, వాహనదారులకు రహదారి కష్టాలు తీరనున్నాయి.

విద్యారంగ సమస్యలు పరిష్కరించాలి

గోనెగండ్ల, డిసెంబరు 1(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం విద్యారంగంలో నెలకొన్న పలు సమస్యలను వెంటనే పరిష్కరించాలని ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు సాయిఉదయ్, యూటీఎఫ్ జిల్లా నాయకులు నరసింహులు డిమాండ్ చేశారు. సోమవారం గోనెగండ్లలో ఎస్ఎఫ్ఐ మండల మహాసభ నిర్వహించారు. ఈ సభ మండల అధ్యక్షుడు పవన్ అధ్యక్షతన జరిగింది. అనంతరం వారు మాట్లాడుతూ జిల్లాలోని గ్రామాల్లో విద్యార్థులకు సరిపడ గదులు లేని పాఠశాలలు ఎన్నో ఉన్నాయని వారు తెలిపారు. చెట్ల కింద విద్యాబోధన చేయాల్సి వస్తుందని ఆవేదన వ్యక్తం చేశారు. మండలంలో బాలుర వసతి గృహం లేక పోవడంతో విద్యార్థుల ఉన్నత చదవుల ఆశలు నెరవేరడం లేదన్నారు. ఈ కారణంగా విద్యార్థులు విద్యకు దూరం అవుతున్నారని తెలిపారు. మండలంలోని ప్రతి గ్రామానికి బస్సుసౌకర్యం ఏర్పాటు చేసి విద్యార్థులకు వీలు కల్పించాలని కోరారు. అనంతరం నూతన కమిటీని ఎన్నిక జరిగింది. నూతన అధ్యక్ష కార్యదర్శులుగా సోమశేఖర్, పవన్‌తో పాటు మరో పది మందిని కమిటీ సభ్యులుగా ఎన్నుకున్నారు.